PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 129, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 29 - జూన్ - 2026 , వెల రూ.5/-

## పవన్ కు కులం రంగు పులిమారు...

## అనితను మేకప్ పేరిట అవమానించారు

### పవన్, అనితపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సీఎం



అమరావతి: విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేయడం, హోంమంత్రి వంగలపూడి అనిత మేకప్‌పై అవమానకరంగా మాట్లాడటం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి గొడ్డలి పార్టీ వారికి సిగ్గు అనిపించడం లేదని, పోలీసులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇవన్నీ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు మిగతా 2 లో

## జులై మొదటివారంలో భారీ వర్షాలు



2లో

- రుతుపవనాల విస్తరణకు సానుకూల పరిస్థితులు
- ఉత్తరాదిలో కొనసాగుతున్న పొడి వాతావరణం
- బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి లేకపోవడమే

### గల్ఫ్ దేశాల్లో హై అలర్ట్

## గల్ఫ్‌లో సైరన్ల మోత..



2లో

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి
- దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ , బందర్-ఎ-లెంగెహ్, ఖెష్మ్ ద్వీపం ప్రాంతాల్లో ఉన్న సైనిక లక్ష్యాలపై దాడులు

## కువైట్, బహ్రెయిన్‌లపై విరుచుకుపడిన ఇరాన్..

- ట్రంప్ హెచ్చరికతో యుద్ధ మేఘాలు!
- అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు
- కువైట్, బహ్రెయిన్ లక్ష్యంగా డ్రోన్ల ప్రయోగం
- ఇరాన్ ఉనికిని తుడిచేస్తామన్న డొనాల్డ్ ట్రంప్
- ప్రాంతీయ శాంతి ఒప్పందానికి తీవ్ర విఘాతం

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసి) సంచలన చర్యకు పూనుకుంది. కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న మిగతా 2 లో



## జులై 2న జీరాంజీపై

# తుది నిర్ణయం

- వీబీజీ రాంజీ చట్టాన్ని అమలు చేయకపోతే, కేంద్రం ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నిధులను నిలిపివేసే అవకాశం ఉంది
- ప్రత్యేక చట్టం, ఇతర ప్రత్యామ్నాయాల పరిశీలన
- “వీబీజీ రాంజీ చట్టాన్ని న్యాయ, రాజ్యాంగపరంగా వ్యతిరేకించాలని తీర్మానించాం



హైదరాబాద్: తెలంగాణలో జీరాంజీ పథకం అమలు చేయాలా, వద్దా? అనే అంశంపై జులై 2న జరిగే మంత్రిమండలి మిగతా 2 లో

### శ్రీవారి సేవలో అనంత్ అంబానీ..

## టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం

### తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంత్ అంబానీ



2లో

- టీటీడీకి రూ.27.5 కోట్లతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ప్రకటన
- బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని వెల్లడి



## ప్రజావేదిక కూల్చివేతతోనే వైసీపీ విధ్వంసం మొదలైంది

- అమరావతిపై వైసీపీ కక్షగట్టింది: మంత్రి నాదెండ్ల మనోహర్
- అమరావతిపై వైసీపీ కక్షగట్టిందన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతులపైకి దండయాత్రలా వెళ్లి రాళ్ల దాడికి పాల్పడ్డారని ఆరోపణ
- అమరావతిలో పనులు వేగవంతం కావడంతో ఓర్వలేకపోతున్నారన్న నాదెండ్ల
- రాజధానిలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపణ



## అధికారులు ధైర్యంగా ప్రక్రియ పూర్తి చేయాలి

- మజ్లిస్ పార్టీ కనుసైగల్లో సర్వే నడవదు
- గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా అనేకసార్లు జరిగింది
- అనర్హులు, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే దీని లక్ష్యం

హైదరాబాద్: కాంగ్రెస్, భారాసలు ‘సర్’ ప్రక్రియపై అనవసర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని, మజ్లిస్ పార్టీ కనుసైగల్లో ‘సర్’ నడవాలంటే కుదరదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ‘కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చే కార్యక్రమం. మిగతా 2 లో

## కులాన్ని గడప లోపలే వదిలేయాలి

### పార్టీ కోసం 12 ఏళ్లుగా కష్టపడ్డ వారిని గుర్తిస్తున్నాం

- సాధికారత అంటే ఒక కులాన్ని బయటకు తీసుకురావడం కాదు. మనం ఎదగాలి, ఎదుటివాళ్లూ ఎదిగేలా చేయాలి
- బూతులు తిట్టేవాళ్లగా, క్రిమినల్స్‌గా కాపుల్ని చూపించే ప్లాన్
- అధికారం కోసం ఏ కులాన్నయినా, మతాన్నయినా వైకాపా ఇలాగే వాడేస్తుంది
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ధ్వజం




, అమరావతి: ‘కులం అనేది సామాజిక సత్యం. దాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నించను. అలాగని కులం కార్డుతో రాజకీయాలు చేయలేదు, చేయను. కులాన్ని ఇంటి గడప లోపలే వదిలేయాలి. గడప దాటితే మన సంస్కృతి, భాష, దేశం, మానవత్వమే గుర్తుండాలి. ఏ సామాజికవర్గం నాయకత్వం వహించాలన్నా మిగిలిన కులాల ఆమోదం పొందాల్సిందే. సాధికారత అంటే ఒక కులాన్ని బయటకు తీసుకురావడం కాదు. మనం ఎదగాలి, ఎదుటివాళ్లూ ఎదిగేలా చేయాలని మిగతా 2 లో



2లో

## జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం
- ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం
- త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం

## రూ. 586 కోట్లతో మాస్టర్‌ప్లాన్‌కు

# ప్రభుత్వ ఆమోదం

### తొలి విడతలో రూ. 200 కోట్ల నిధులతో ఆలయ విస్తరణ

- వచ్చే ఏడాది జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలి
- మూడో విడతగా భద్రాచలం టెంపుల్ టౌన్ అభివృద్ధిని రూ. 127 కోట్లతో 2029 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక



భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రగిరి నూతన రూపు సంతరించు కోనుంది. తొలి దశలో రూ. 200 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించగా పురాతన భవనాలు, ఆలయాల కూల్చివేతతోపాటు నిర్మాణ పనుల ప్రారంభానికి పూజాదికాలు జరపనున్నారు. మిగతా 2 లో



2లో

## అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

### చంద్రబాబుపై వైఎస్ జగన్ ఫైర్

- అమరావతిలో వైసీపీ నేతలపై జరిగిన దాడిని ఖండించిన జగన్
- చంద్రబాబే ఈ దాడిని ఉసిగొల్పారని తీవ్ర ఆరోపణ
- ఈ దుష్ట సంప్రదాయానికి రెట్టింపు స్పందన ఉంటుందని హెచ్చరిక

అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై

## ఫిఫా ప్రపంచకప్‌లో సంచలనం..
# 52 ఏళ్ల తర్వాత కాంగో తొలి చారిత్రక విజయం!

ఢిల్లీ: ఫిఫా ప్రపంచకప్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్ కాంగో) సరికొత్త చరిత్ర సృష్టించింది. 52 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తమ మొట్టమొదటి ప్రపంచకప్ విజయాన్ని నమోదు చేసింది. ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 3-1 తేడాతో ఘన విజయం సాధించి, టోర్నమెంట్ చరిత్రలో తొలిసారి నాకౌట్ (రౌండ్ ఆఫ్ 32) దశకు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓ దశలో ఒక గోల్ వెనుకబడినప్పటికీ, కాంగో అద్భుతంగా పుంజుకుంది. ఆట 10వ నిమిషంలో ఉజ్బెకిస్థాన్ ఆటగాడు ఎల్డోర్ షోమురోడోవ్ గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ద్వితీయార్ధంలో కాంగో ఎదురుదాడికి దిగింది. 68వ నిమిషంలో లభించిన పెనాల్టీని యోవానే విస్సా గోల్‌గా మార్చి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత కేవలం 10 నిమిషాలకే, 78వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఫిస్టన్ మాయేలే మరో గోల్ చేసి కాంగోకు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఇంజూరీ టైమ్‌లో విస్సా తన రెండో గోల్ కొట్టి కాంగో విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో కాంగో జట్టు ఉత్తమ మూడో స్థానం పొందిన జట్లలో ఒకటిగా నాకౌట్‌కు అర్హత సంపాదించింది. ఈ ఓటమితో ఉజ్బెకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. కాంగో దేశం గతంలో 1974లో 'జైర్' పేరుతో ప్రపంచకప్‌కు అర్హత సాధించినా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత టోర్నీలో అడుగుపెట్టి చారిత్రక విజయం సాధించడం విశేషం. జులై 1న అట్లాంటాలో జరిగే రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో కాంగో పటిష్టమైన ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

# జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

# స్థిరంగా బంగారం ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో రేట్లు ఇలా!

హైదరాబాద్/అమరావతి: భారతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఆదివారం స్థిరంగా కొనసాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న హెచ్చుతగ్గుల అనంతరం, (జూన్ 28న) పసిడి ధరల్లో ఎటువంటి మార్పు నమోదు కాలేదు. ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడల్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,43,950 వద్ద నిలకడగా ఉంది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,31,950గా నమోదైంది. కిలో వెండి ధర సైతం ఎటువంటి మార్పు లేకుండా రూ. 2,45,000 వద్దే కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ముఖ్య నగరాలైన వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలలో కూడా హైదరాబాద్, విజయవాడల్లోని ధరలే అమలవుతున్నాయి. అయితే, దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,45,860గా ఉండగా, ఢిల్లీలో రూ. 1,44,100గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ధరలు దాదాపు హైదరాబాద్ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, దేశీయ డిమాండ్‌లో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల ఇటీవలి కాలంలో ధరల్లో అస్థిరత నెలకొంది. ప్రస్తుతం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, కొనుగోలు చేసే సమయంలో అప్పటి లైవ్ రేట్లను సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నాణ్యత, మేకింగ్ ఛార్జీలు, స్థానిక పన్నుల ప్రాతిపదికన తుది ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంటుంది.

# జులై 2న జీరాంజీపై తుది నిర్ణయం




హైదరాబాద్: తెలంగాణలో జీరాంజీ పథకం అమలు చేయాలా, వద్దా? అనే అంశంపై జులై 2న జరిగే మంత్రిమండలి సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు తెలిపారు. కేంద్ర పథకంపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాసంఘాల వ్యతిరేకత దృష్ట్యా అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం వంటి ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తామని వెల్లడించారు. జీరాంజీపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఉత్తమ్, సీతక్క హాజరు కాగా.. తుమ్మల, వివేక్‌లు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. తొలుత వివిధ కార్మిక, పౌర, ప్రజా సంఘాల ప్రతినిధులతో, అనంతరం అధికారులతో సమావేశమై చర్చించారు. వీబీజీ రాంజీ చట్టాన్ని అమలు చేయకపోతే, కేంద్రం ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నిధులను నిలిపివేసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీంతో రాజ్యాంగ, న్యాయపరమైన అన్ని కోణాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. "వీబీజీ రాంజీ చట్టాన్ని న్యాయ, రాజ్యాంగపరంగా వ్యతిరేకించాలని తీర్మానించాం. సోమవారం దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో జరిగే సమావేశంలో తెలంగాణ అభ్యంతరాలు, సూచనలు, సవరణల ప్రతిపాదనలను స్పష్టంగా వినిపిస్తాం. కేంద్ర వైఖరిని నిరసిస్తూ కర్ణాటక, కేరళతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తాం" అని వివరించారు.

## గల్ఫ్ దేశాల్లో హై అలర్ట్
# గల్ఫ్‌లో సైరన్ల మోత..

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. వాణిజ్య నౌకలపై డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా అమెరికా వరుసగా రెండో రోజు ఇరాన్‌పై వైమానిక దాడులు నిర్వహించింది. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ , బందర్-ఎ-లెంగెహ్, ఖెష్మ్ ద్వీపం ప్రాంతాల్లో ఉన్న సైనిక లక్ష్యాలపై దాడులు జరిగినట్లు అమెరికా అధికారులు తెలిపారు. అమెరికా దాడులు పునరావృతం కాకుండా అడ్డుకునేందుకు హార్మూజ్ జలసంధి తమకు కీలక వ్యూహాత్మక ఒత్తిడి సాధనమని ఇరాన్ స్పష్టం చేసింది. జలసంధిపై తమ ప్రభావాన్ని వదులుకుంటే, అమెరికా మరోసారి దాడులు చేసేందుకు అవకాశం కల్పించినట్టే అవుతుందని టెహ్రాన్‌కు చెందిన అబ్బాస్ అస్లానీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం బలప్రయోగం ద్వారా హార్మూజ్ జలసంధిలో పరిస్థితులను మార్చాలని ప్రయత్నిస్తోందని, అయితే అలాంటి చర్యలు టెహ్రాన్‌కు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్--లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మంత్రి ఇటమార్ బెన్-గ్విర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం హెజ్‌బొల్లాకు మళ్లీ ఊపిరి పోసినట్టేనని, ఆ సంస్థను పూర్తిగా నిర్మూలించాల్సింది పోయి కాల్పుల విరమణతో అవకాశం కల్పించారని విమర్శించారు. లెబనాన్ సైన్యం హెజ్‌బొల్లాను నియంత్రించగలదన్న వాదన ప్రమాదకర భ్రమే అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా--ఇరాన్ తాజా ఘర్షణలతో టెహ్రాన్ ప్రజల్లో మళ్లీ యుద్ధ భయాలు పెరిగాయి. కాల్పుల విరమణ ఒప్పందం ఎంత సున్నితంగా ఉందో ఈ పరిణామాలు చూపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరిస్తూ, దాడులు కొనసాగితే సైనికంగా పూర్తిగా ముగిస్తాం అంటూ కఠిన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని, అందుకే ఈ చర్యలు తీసుకున్నామని అమెరికా పేర్కొంది. ఇదిలా ఉండగా, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ మిస్సైళ్లు, డ్రోన్లతో అమెరికా మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకుంది. బహ్రెయిన్‌లో వైమానిక దాడి హెచ్చరిక సైరన్లు మోగగా, కువైట్ తన గగనతల రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేసి శత్రు డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కొంటున్నట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌పై డ్రోన్ దాడి జరిగినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. బహ్రెయిన్‌లో అమెరికా నౌకాదళానికి చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరం ఉండటంతో ఈ ఘటనకు ప్రాధాన్యం ఏర్పడింది. దేశ సార్వభౌమాధికారంపై దాడిగా దీనిని బహ్రెయిన్ ఖండించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద భద్రతా పరిస్థితి మరింత దిగజారింది. అక్కడ ప్రయాణించే వాణిజ్య నౌకలకు ముప్పు పెరగడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాలు మరిన్ని సైనిక చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇవ్వడంతో, మధ్యప్రాచ్యంలో పరిస్థితి గంట గంటకూ ఉద్రిక్తంగా మారుతోంది. అంతర్జాతీయ సమాజం మాత్రం సంయమనం పాటించాలని ఇరు దేశాలకు పిలుపునిస్తోంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లలో కొన్ని అమెరికా మిత్రదేశాల గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు సమాచారం. అయితే కొన్ని ప్రాంతాల్లో పేలుళ్లు చోటుచేసుకున్నాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. పూర్తి నష్టం, ప్రాణనష్టం వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

# పవన్ కు కులం రంగు పులిమారు...
# అనితను మేకప్ పేరిట అవమానించారు

మొదటి పేజి తరువాయి

మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టిపల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ నేతలు అమరావతిపై కుట్ర చేయడానికే అక్కడికి వెళ్లారని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకే రైతులను రెచ్చగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. "గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా వేచి ఉన్నాయి. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదు. దేవాలయాలపై దాడులు చేసిన వాళ్లే ఇప్పుడు గుళ్లకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. వాళ్లవి పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది" అని అన్నారు. గత పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసంతో రాష్ట్రం నలిగిపోయిందని, ఇప్పుడు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పునరావాసం కింద రైతులకు రూ.300 కోట్లు అందించామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తామన్నారు. వెలిగొండతో రెండు దశల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. "నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామరక్ష. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తీసుకెళ్లి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఈ విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం" అని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రామాయపట్నం పోర్టును పూర్తి చేసి పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా? అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో పర్యటిస్తున్న వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను చంద్రబాబే స్వయంగా ఉసిగొల్పారని ఆరోపిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన వరుస పోస్టులు చేశారు. రాజధాని ప్రాంత రైతుల ఆహ్వానం మేరకు సీఆర్డీయే పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న తమ పార్టీ నేతలపై దాడి చేయించడం ద్వారా పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని హననం చేశారని జగన్ మండిపడ్డారు. కొందరు పోలీసు అధికారులు దగ్గరుండి ఈ దాడిని సమన్వయం చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతి, రైతులపై సాగుతున్న దౌర్జన్యాలు బయటపడకుండా ఉండేందుకే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వని రైతులను భూసేకరణ నోటీసులతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడం వంటి దారుణాలకు ప్రభుత్వం ఒడిగడుతోందని జగన్ ఆరోపించారు. కొండవీటి వాగు నీటిని బలవంతంగా పొలాల్లోకి మళ్లించి, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేడు మీరు మొదలుపెట్టిన ఈ దుష్ట సంప్రదాయానికి, భవిష్యత్తులో రెట్టింపు స్పందన ఉంటుంది. ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు," అని చంద్రబాబును హెచ్చరించారు. ఈ దాడులకు వైసీపీ తలవంచదని, అమరావతి రైతులు, బాధితులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

# జులై మొదటివారంలో భారీ వర్షాలు

ఢిల్లీ: ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్నప్పటికీ.. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని పేర్కొంది. రుతుపవనాల చలనం ఉత్తర దిశగా సాగుతున్నప్పటికీ.. ఢిల్లీ-ఎన్‌సిఆర్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు.

విస్తరణకు.. వర్షాలకు తేడా ఇదే

వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం, రుతుపవనాల 'విస్తరణ' అంటే గాలి దిశల్లో మార్పులు, తేమ పెరగడం, నిర్దేశిత ప్రాంతాలలో స్థిరమైన వర్షపాతం నమోదు కావడం మాత్రమే. అంతేకానీ అన్ని చోట్లా వెంటనే భారీ వర్షాలు కురుస్తాయని కాదు. ఉపగ్రహ చిత్రాల ప్రకారం ప్రస్తుతానికి రుతుపవన మేఘాలు మధ్య భారతదేశం, బంగాళాఖాతం, ఈశాన్య ప్రాంతం, దక్షిణ ద్వీపకల్పంపైనే కేంద్రీకృతమై ఉన్నాయి. దీనివల్ల ఉత్తర మైదాన ప్రాంతాలలో ఆకాశం నిర్మలంగా ఉంది. బంగాళాఖాతంలో బలమైన అల్పపీడన వ్యవస్థలు ఏర్పడకపోవడమే ప్రస్తుత మందగమనానికి ప్రధాన కారణం. సాధారణంగా ఇటువంటి వ్యవస్థలు దేశం లోపలికి తేమను లాగి మధ్య, ఉత్తర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిపిస్తాయి. అవి లేకపోవడంతో నైరుతి గాలుల తీవ్రత తగ్గి, ఆశించిన స్థాయిలో కాకుండా అక్కడక్కడా మాత్రమే ఉరుములతో కూడిన జల్లులు పడుతున్నాయి.

త్వరలోనే ఊరట

వాతావరణంలో త్వరలోనే సానుకూల మార్పులు రానున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. తూర్పు హిందూ మహాసముద్రంలో ఒక పెద్ద ఉష్ణమండల వాతావరణ వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందని, ఇది రాబోయే నాలుగు నుండి ఏడు రోజుల్లో ఉత్తర దిశగా బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. దీనివల్ల పశ్చిమ భారతదేశంలో అల్పపీడనం ఏర్పడి, తేమ పెరిగి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ అంచనాలు నిజమైతే, జులై మొదటి వారంలో మధ్య, పశ్చిమ, ఉత్తర భారతదేశంలో వర్షాలు ఊపందుకుంటాయి. ఇది ఢిల్లీ-ఎన్‌సిఆర్ సహా వాయవ్య భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు మరింత విస్తరించడానికి తోడ్పడుతుంది. రాబోయే వారంలో వాయవ్య భారతదేశంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు ఉత్తర దిశగా ప్రయాణించడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండి తాజా నివేదిక కూడా ధ్రువీకరించింది. ఈ ఏడాది రుతుపవనాలు స్వల్ప ఆలస్యంతో జూన్ 4న కేరళను తాకాయి. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రారంభంలో కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశం ప్రస్తుతం ఒక 'వేచి చూసే దశ'ను ఎదుర్కొంటోంది, ఇక్కడ వాతావరణ మార్పుల పరంగా రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వర్షాలు కురవడం ఇంకా ప్రారంభం కాలేదు.

# కువైట్, బహ్రెయిన్‌లపై విరుచుకుపడిన ఇరాన్..

కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బలగాలు ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక పరిణామంతో ఆ ప్రాంతంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా పక్కకుపోయి, ఉభయ దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి సమీపంలో ఉన్న తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, తీరప్రాంత రాడార్ స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకోగా, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లో భారీ అలజడి రేగింది. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

బహిరంగ హెచ్చరికలు

ఈ దాడి అనంతరం ఇరాన్ నావికాదళం అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు 'నరకాన్ని చూస్తాయని' వ్యాఖ్యానించింది. అమెరికాయే మొదట శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలను పాటించని నౌకలపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ గనుక ఇలాగే ఒప్పందాలను ఉల్లంఘిస్తూ పోతే వాషింగ్టన్ సైనిక పరంగా ఈ కథను ముగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అటువంటి పరిస్థితి వస్తే ప్రపంచ పటంలో 'ఇరాన్ అనే దేశమే ఇకపై ఉనికిలో ఉండదు' అంటూ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

ముదిరిన సంక్షోభం

హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'కికు' అనే అంతర్జాతీయ చమురు నౌకపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి ప్రతిచర్యగా అమెరికా సైన్యం దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. అమెరికా వరుసగా రెండో రోజు కూడా ఇరాన్ స్థావరాలను ధ్వంసం చేయడంతో ఇరాన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది.

# ప్రజావేదిక కూల్చివేతతోనే వైసీపీ విధ్వంసం మొదలైంది

అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కక్షగట్టి వ్యవహరిస్తోందని, అక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే దాడులకు తెగబడుతోందని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం రాజధాని ప్రాంతంలో వైసీపీ నేతల పర్యటన ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా ఉందని, రైతులపైకి దండయాత్రలా వెళ్లి రాళ్ల దాడికి దిగడం వారి కుట్రపూరిత వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జగన్ మోహన్ రెడ్డి పాలన విధ్వంసంతోనే మొదలైందని, ప్రజావేదిక కూల్చివేత నుంచి నేటి రాళ్ల దాడి వరకు వైసీపీ దుష్ట ఆలోచనలు బయటపడుతూనే ఉన్నాయని ఆరోపించారు. మూడు రాజధానుల పేరుతో గతంలో రైతులను నట్టేట ముంచారని, ఇప్పుడు ప్రజలు తిరస్కరించినా "మావిగన్" వంటి విచిత్రమైన పేర్లతో హాస్యాస్పదంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతం కావడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని మనోహర్ పేర్కొన్నారు. భవన నిర్మాణాలు, రహదారుల పనులు చురుగ్గా సాగుతుండటాన్ని చూసి ఓర్వలేక, రాజధానిలో అలజడి సృష్టించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. వైసీపీ అనాలోచిత చర్యలను ప్రజలు తప్పకుండా తిప్పికొడతారని ఆయన హెచ్చరించారు.

## శ్రీవారి సేవలో అనంత్ అంబానీ..
# టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం

తిరుపతి: ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీకి భారీ విరాళం ప్రకటించారు. తిరుమల ఘాట్ రోడ్లలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూ.27.5 కోట్ల వ్యయంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్న అనంత్ అంబానీ, శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో సమావేశమైన అనంత్ అంబానీ, తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలోనే ఆయన భారీ విరాళంపై ప్రకటన చేశారు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులను అందించడమే కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే డ్రైవర్ల జీతభత్యాలను సైతం పూర్తిగా రిలయన్స్ సంస్థే భరిస్తుందని స్పష్టం చేశారు. అనంత్ అంబానీ తీసుకున్న ఈ నిర్ణయంపై టీటీడీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సోమవారం నాటి వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

# అధికారులు ధైర్యంగా ప్రక్రియ పూర్తి చేయాలి

మొదటి పేజి తరువాయి

ఇది గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా అనేకసార్లు జరిగింది. ఇది పూర్తిగా భారత ఎన్నికల సంఘం నిర్వహించే రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర ప్రక్రియ. అర్హత ఉన్న ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించడంతోపాటు.. అనర్హులు, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే దీని లక్ష్యం. కొన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియను కూడా రాజకీయ కోణంలో చూస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇటీవల పబ్లిక్ గార్డెన్ వద్ద జరిగిన సమావేశంలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా 'సర్'పై తప్పుడు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో రోహింగ్యాలు, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచి అక్రమంగా వచ్చినవారు ఉన్నారనే విషయాలు గతంలో అనేక కేసుల ద్వారా బయటపడ్డాయి. వారిలో చాలామందికి ఓటరు, ఆధార్, రేషన్‌కార్డులు కూడా ఉన్నాయనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వాస్తవాలను పక్కనబెట్టి సర్ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యం. పాతబస్తీ ప్రాంతంలో ఎంఐఎం నాయకులు బీఎల్‌వోలను బెదిరిస్తూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయొద్దని, తమ ద్వారా మాత్రమే ఫారాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరు బెదిరించినా ఉద్యోగులు భయపడొద్దు. జిల్లా కలెక్టర్లు, అధికారులందరూ ధైర్యంగా, నిష్పక్షపాతంగా 'సర్' ప్రక్రియను పూర్తి చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. హైదరాబాద్‌లో ఓటు ఉంటే ఊళ్లలో వచ్చే సంక్షేమ పథకాలు పోతాయని కూడా ప్రచారం చేస్తున్నారు. ఓటుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదు. కొన్నిచోట్ల బీఎల్‌వోలతో ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని కార్యక్రమాలు కూడా చేయిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై మేం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రూ. 586 కోట్లతో మాస్టర్‌ప్లాన్‌కు ప్రభుత్వ ఆమోదం

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రగిరి నూతన రూపు సంతరించు కోనుంది. తొలి దశలో రూ. 200 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించగా పురాతన భవనాలు, ఆలయాల కూల్చివేతతోపాటు నిర్మాణ పనుల ప్రారంభానికి పూజాదికాలు జరపనున్నారు. వెంటనే పనులు ప్రారంభించి వచ్చే ఏడాది జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు టెండర్ దక్కించుకున్న నిర్మాణ సంస్థ ప్రతినిధులు, కన్సల్టెన్సీ బాధ్యులు.. ఆలయ ఈఓ దామోదర్‌రావుతో కలిసి రామాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.



ప్రధానాలయం మినహా సమూలంగా..

16వ శతాబ్దంలో భక్త రామదాసుగా పేరుగాంచిన కంచర్ల గోపన్న భద్రాచలంలో రామాలయం నిర్మించారు. 1960లో ఆలయంలో గోపురం పనులు చేపట్టారు. అనంతరం స్వల్ప మార్పులు తప్ప ఇప్పటివరకు రామాలయ అభివృద్ధి జరగలేదు. కాలక్రమేణా భద్రాచలానికి భక్తుల రద్దీ పెరిగిన దృష్ట్యా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అయితే రామదాసు నిర్మించిన ప్రధానాలయం మినహా ఇతర ఉపాలయాలు, పరిపాలనా భవనాలు, వంటశాలలు, పూజా మండపాలు, పార్కింగ్ జోన్లు ఇతరత్రా వసతులను జోడించేలా రూ. 586 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభించింది. ఇందులో తొలి విడతగా గోదావరి ఒడ్డున రూ. 75 కోట్లతో పనులు చేపట్టడంతోపాటు ఆలయ కాంప్లెక్స్ విస్తరణకు రూ. 180 కోట్లు, పరిసర ప్రాంతాల అభివృద్ధి, ఇతర కార్యాలయాల నిర్మాణానికి రూ. 96 కోట్లు కలిపి రూ. 351 కోట్ల విలువైన పనులను 2027 నాటికి పూర్తి చేయాలని ప్రతిపాదించారు. కానీ ఇందులో కాంప్లెక్స్ విస్తరణ పనుల అంచనాలను రూ. 200 కోట్లకు సవరించి చేపట్టేందుకు సిద్ధమై టెండర్ ఖరారు చేశారు. ఇతర పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఇక రెండో విడతగా 6 ఎకరాల స్థలంలో పార్కింగ్, ఇతర అభివృద్ధి పనులతో రూ. 108 కోట్లతో 2028 నాటికి, మూడో విడతగా భద్రాచలం టెంపుల్ టౌన్ అభివృద్ధిని రూ. 127 కోట్లతో 2029 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. కాగా, ప్రధానాలయానికి ఎలాంటి మార్పులు లేకపోవడంతో భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

# కులాన్ని గడప లోపలే వదిలేయాలి

అమరావతి: 'కులం అనేది సామాజిక సత్యం. దాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నించను. అలాగని కులం కార్డుతో రాజకీయాలు చేయలేదు, చేయను. కులాన్ని ఇంటి గడప లోపలే వదిలేయాలి. గడప దాటితే మన సంస్కృతి, భాష, దేశం, మానవత్వమే గుర్తుండాలి. ఏ సామాజికవర్గం నాయకత్వం వహించాలన్నా మిగిలిన కులాల ఆమోదం పొందాల్సిందే. సాధికారత అంటే ఒక కులాన్ని బయటకు తీసుకురావడం కాదు. మనం ఎదగాలి, ఎదుటివాళ్లూ ఎదిగేలా చేయాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైకాపాపై ధ్వజమెత్తారు . బీసీ కులాలైనా, కాపులైనా ఎవరో అధికారం ఇవ్వాలని కోరుకోకూడదు. 50% పైగా ఉన్న వారు వేరే వాళ్లను అధికారం కోసం అడగడమేంటి? కలిసి ఉంటే ఎవరికి వారే బలపడి, అధికారం సాధిస్తారు. నేను ఒక కులం కోసం ఆలోచించే వ్యక్తినైతే బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలోకి ఎందుకు వస్తారు? వైకాపా విధివిధానాలు నచ్చకే గట్టిగా మాట్లాడతా. ఎదుటి వ్యక్తిని బట్టి మనం కూడా గట్టిగా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. పంతం నానాజీ ఏదో ఎక్కువ మాట్లాడారని అంటున్నారు. అదే ప్రాంతంలో (కాకినాడ గ్రామీణ) అప్పటి వైకాపా ఎమ్మెల్యే ఏం మాట్లాడారో, ఎంత అసభ్యంగా మాట్లాడారో మరిచిపోయామనుకుంటున్నారా? అలాగని నానాజీ మాట్లాడిన విధానాన్ని ప్రోత్సహించం.

అధికారం కోసం కులాలతో రాజకీయ క్రీడ ఆడుతున్నారని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైకాపాపై ధ్వజమెత్తారు. బూతులు తిట్టేవాళ్లుగా, క్రిమినల్స్‌గా కాపుల్ని ప్రొజెక్ట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్ నాయకత్వాన్ని జనసైనికుల నుంచే తయారు చేసే పని ప్రారంభించామని, జనసేన రాష్ట్ర నాయకత్వం కార్యకర్తల నుంచే ఉంటుందని పేర్కొన్నారు. 'వైకాపా వారు కాపు నాయకులతో నన్ను బూతులు తిట్టిస్తున్నారు. కాపులు అనగానే బూతులు తిట్టేవాళ్లు, క్రిమినల్స్ అని ప్రజల్లో ముద్ర పడేలా చేస్తున్నారు. కాపుల విషయంలోనే కాదు.. ఏ కులంతోనైనా వీళ్ల అధికారం కోసం ఇలాగే రాజకీయం చేస్తారు. ఎప్పుడైనా ఒక పది మంది చేతిలోనే అధికారం ఉంటుంది. వాళ్లకి కులం ఉండదు. వైకాపాకు సంబంధించి ఒక గ్రూప్ ఉంటుంది. అది కేవలం సామాజికవర్గ గ్రూప్ కాదు. వాళు అధికారం కోసం కులాన్ని, మతాన్ని ఇంకా అవసరమయితే దేన్నయినా వాడతారు' అని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. అయినా కేవలం కులం ప్రాతిపదికన ఓ క్రిమినల్‌కు వత్తాసు పలుకుతారా అని మండిపడ్డారు.

జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో నాయకత్వ సామర్థ్యమేంటో తేలింది. దాన్ని ఇప్పుడు పార్టీ సంస్థాగత నిర్మాణంగా మార్చే సమయం వచ్చింది. పార్టీకి 18 వేల మంది బలమైన సాధక్‌లున్నారు. వీరిలో ఉన్న అసలైన శక్తిని, నిబద్ధతను పార్టీ కోసం ఉపయోగించుకునే బాధ్యత తీసుకున్నా. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి 28 మందితో సమాచార కమిటీలు వేశాం. ఎలాంటి గుర్తింపు లేకపోయినా ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసిన నిజమైన జనసైనికులకే వీటిలో స్థానం కల్పించాం. వీరిలో ఒక ఆటోడ్రైవర్, రోజు కూలీ, టీ కొట్టు నడిపే వ్యక్తి, గృహిణి ఉన్నారు. సమాచార సేకరణ కమిటీల్లో 700 మందిలో 600 మంది సాధక్‌లే. పార్టీ కోసం కష్టపడేవారిని వారే గుర్తించగలరనే అవకాశం ఇచ్చాం. ఇవి కేవలం సమాచార సేకరణ కమిటీలు కాదు. జనసేనలో 12 ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించి సరైనచోట సరైన నాయకత్వ బాధ్యతలు అప్పగించే కార్యక్రమం ఇది. క్షేత్రస్థాయిలో వీరు సేకరించిన సమాచారం ఆధారంగా పార్టీ నాయకులు, సాధక్‌లతో నేనే చర్చించి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తా. గతంలో కొందరు నాయకులకు పార్టీ నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తే ముందుకు తీసుకువెళ్లలేకపోయారు. పార్టీ అంటే పెద్ద నాయకులు కాదు. సామాన్య కార్యకర్తల వల్లే జనసేన ఈ స్థాయికి చేరింది. నన్ను అర్థం చేసుకునేవాళ్లు 10 మంది నా చుట్టూ ఉంటే ఈపాటికి జనసేనకు కోటి సభ్యత్వం ఉండేది. సంక్షేమ పథకాలకు జనసేన వ్యతిరేకం కాదు.. అలాగని మౌలిక సౌకర్యాలు కల్పించకుండా సంక్షేమ పథకాలతోనే విజయం సాధ్యం కాదు. వైకాపా బటన్లు నొక్కినా అధికారంలోకి రాలేదని గుర్తుంచుకోవాలి' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

29 నుంచి సమాచార సేకరణ

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచారాన్ని ఈ నెల 29 నుంచి సేకరించనున్నట్టు ఆ పార్టీ తెలిపింది. ఇందుకోసం ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గ పరిశీలకుడు, కమిటీ సభ్యుల్ని నియమించామని శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

## 'ఓం శివశక్తి పీఠం - శంభాల నగరం' లో వైభవంగా మహాకుంబాభిషేక మహోత్సవాలు, ఆధ్యాత్మిక శోభతో పులకించిన గాదరాడ..

### నాల్గవ రోజు ఘనంగా విగ్రహ ప్రతిష్ట మరియు మహాకుంబాభిషేక మహోత్సవాలు..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణచే నిర్మించబడిన ప్రముఖ ఆధ్యాత్మిక దివ్యధామం 'ఓం శివశక్తి పీఠం - శంభాల నగరం' లో మహాకుంబాభిషేక, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలతో గాదరాడ గ్రామం, పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 36 దివ్య ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన పర్వాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, హోమగుండాల నుంచి వస్తున్న పవిత్ర ధూపాలతో ఈ ప్రాంతమంతా ఒక దివ్య లోకాన్ని తలపిస్తోంది. మహోత్సవాలలో భాగంగా ఈరోజు వినాయక పూజతో కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమై పుణ్యాహవచనం, యాజమాన సంకల్పం, సోమకుంబ పూజ, సూర్య పూజ, మండప పూజ, వేదికార్చన, సమస్త దేవత ఆవాహన పూజ, సమస్త దేవత హోమం, నవాగ్ని యాగపూజ, మూలమంత్ర హోమం, విశేష ఔషధ ద్రవ్య హోమం, పూర్ణాహుతి, దీపారాధన, సమస్త దేవత అష్టబంధన సమర్పణం తో ముగిసింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి, వారి కుమార్తె శ్రీమతి తోట ప్రత్యుషాదేవి, అల్లుడు తోట పవన్, చిన్న కుమార్తె వందనాంబికలు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఓం శివశక్తి పీఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ ప్రాంగణమంతా సాంప్రదాయ తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణలతో కనువిందు చేస్తోంది. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాల సమర్పణ నిరంతరాయంగా సాగుతోంది. సన్నాయి వాయిద్యాలు, మంగళ ధ్వనులు, భక్తుల శివనామ స్మరణలు మరియు భక్తి కీర్తనలతో పీఠం ఒక ఆధ్యాత్మిక నందనవనంగా మారింది.

## పౌర్ణమి పర్వదినాన శివాలయంలో విశేష అభిషేకాలు"



పులిచెర్ల, జూన్ 28,(నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, దేవలంపేటలోని శ్రీ కాశి విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ కాశి విశాలాక్షి అమ్మవారు, శ్రీ కాశి విశ్వేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఎస్. ఫణి ప్రకాష్ శర్మ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు.. ఆరోగ్య భవిష్యత్తుకు భరోసా"



పులిచెర్ల, జూన్ 28,(నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారి ఎల్లయ్య ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఒక్క చిన్నారిని కూడా వదలకుండా ప్రతి ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### – మీకోసం నిర్వహిస్తాం.కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, జూన్ 28( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.ఆర్టీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయికావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## చెస్ కేవలం ఆట కాదు జీవన పాఠం

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..-గుడివాడలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు... 200 మందికి పైగా క్రీడాకారుల హాజరు...ప్రారంభించిన ఎమ్మెల్యే రాము



గుడివాడ, జూన్ 28 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) చెస్ కేవలం ఆట కాదు జీవన పాఠం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.ప్రతి స్కూల్లో చెస్ క్లబ్ పెట్టాలనీ ఆయన సూచించారు.ఎన్టీఆర్ స్టేడియం స్పోర్ట్స్ క్యాలెండర్ లో భాగంగా ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో 11వ ఎన్టీఆర్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి పోటీలను ప్రారంభించి, క్రీడాకారులతో చెస్ ఆడి ఉత్సాహపరిచారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్న స్టేడియం కమిటీను, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. "చెస్ అనేది కేవలం ఆట కాదు, ఏకాగ్రత, వ్యూహం, సహనం నేర్పే జీవన పాఠం అన్నారు. పిల్లలు మొబైల్ గేమ్స్ వదిలి బోర్డు మీద ఆలోచించడం నేర్చుకోవాలన్నారు. కోనేరు హంపి, హారిక లాంటి తెలుగు చెస్ స్టార్లను స్ఫూర్తిగా తీసుకుని మన పిల్లలు కూడా అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ స్టేడియంలో మరిన్ని రాష్ట్రస్థాయి ఈవెంట్లు తీసుకురావడానికి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. క్రీడా కోటా, శిక్షణా సదుపాయాలు, కోచ్ల నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సీఎం చంద్రబాబు నాయుడు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పిల్లల టాలెంట్ను గుర్తించి చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోటీలో పాల్గొన్న అన్ని జిల్లాల క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పి, విజేతలకు ముందస్తు అభినందనలు తెలిపారు.పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసామని విజేతలకు బహుమతులు అందిస్తామని వైస్ చైర్మన్ యలవర్తి తెలిపారు.కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిల్లారపు రంగప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ జైన్, మున్నలూరి లక్ష్మణరావు, జీవిత సభ్యులు పిన్నమనేని వెంకట రామయ్య, స్టేడియం సిబ్బంది, కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డీఈఓ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్ ,వెంకటరెడ్డి ,రమేష్ బాబు క్యూలైన్లు పర్యవేక్షణ చేసి భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేశారు. రద్దీ భారీగా పెరగడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అన్ని రకాల వీఐపీ (ఎక్రూ) దర్శనాలను రద్దు చేశారు. క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం వేగంగా, సులభంగా లభించింది. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరికొత్త నీటి సరఫరా విధానాన్ని ప్రవేశపెట్టారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల వద్దకే సరికొత్త మొబైల్ వాటర్ క్యాన్ల ద్వారా చల్లని తాగునీటిని అందించారు. ఆలయ పరిసరాల్లో ఉచిత ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు.ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు క్యూ లైన్లలో పర్యటించి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. క్యూ లైన్లను క్రమబద్ధీకరించేందుకు సిబ్బందికి ఆలయ సహాయ కమిషనర్ రంగారావు ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీచేశారు.

## ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం లో ఆదివారం ఉదయం సూర్యోపాసన సేవ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. లోక కల్యాణార్థం, భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ పాల్గొని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అరుణ పారాయణం, మహాసౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు.జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్యోపాసన వల్ల ఆరోగ్యం, తేజస్సు, మానసిక ప్రశాంతత లభిస్తాయని పండితులు తెలిపారు. ముఖ్యంగా ఆదివారం సూర్యుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఈ సేవకు విశేష ప్రాధాన్యత ఉంది.సూర్యోపాసన అనంతరం శ్రీ కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చక బృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిత్యుని కృపకు పాత్రులయ్యారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనానికి రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ ఆదివారం విచ్చేయగా ఆలయ చైర్మన్ రాధాకృష్ణ గాంధీ స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## పోలియో నిర్మూలనే లక్ష్యంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమాన్పేటలో ఏర్పాటు చేసిన పోలియో బూత్ను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ చిన్నారులను సమీపంలోని పోలియో బూత్లకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. బూత్కు రాలేని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.**

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026:డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం హనుమాన్పేటలోని పోలింగ్ స్టేషన్ను సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమోదవుతున్న వివరాలను తనిఖీ చేశారు. ఇంకా పంపిణీ చేయాల్సిన ఎన్యుమరేషన్ ఫారాలను త్వరితగతిన అర్హులైన ఓటర్లకు అందజేయడంతో పాటు, ప్రజలు నింపిన ఫారాలను వీలైనంత త్వరగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ గణనీయంగా పురోగమించిందని కమిషనర్ తెలిపారు. విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,77,822 మంది ఓటర్లకు గాను 2,64,918 ఫారాలు పంపిణీ చేసి, 95.36 శాతం పురోగతి సాధించగా, 21,726 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,734 మంది ఓటర్లకు గాను 2,57,753 ఫారాలు పంపిణీ చేసి, 95.56 శాతం పురోగతి నమోదు కాగా, 27,337 ఫారాల డిజిటలైజేషన్ పూర్తైందని, విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,56,980 మంది ఓటర్లకు గాను 2,45,154 ఫారాలు పంపిణీ చేసి, 95.40 శాతం పురోగతి నమోదు కాగా, 15,747 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని కమిషనర్ అన్నారు. ఈ పర్యటనలో ఏఈఆర్ఓ, సీఈ ఇన్చార్జి పి. సత్యకుమారి, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి చిన్నారికి రెండు చుక్కలు వేయించాలి

### -- మంత్రి సవిత , ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- 29వ డివిజన్ మధురానగర్ హెల్త్ సెంటర్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'పల్స్ పోలియో--2026' కార్యక్రమంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సవిత , ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు లు పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం పోలియో కేంద్రాలను పరిశీలించి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను పూర్తిగా నిర్మూలించడంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి భవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో పోలియో నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు అందుబాటులో అనేక పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్లే భారతదేశం పోలియో రహిత దేశంగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా పోలియో రహిత రాష్ట్రంగా గుర్తింపు పొందడం ఆనందకర విషయమని తెలిపారు.పోలియో మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసేవే తమ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులంతా నిరంతరం కృషి చేస్తున్నారని ఉమా అన్నారు.మంత్రి శ్రీమతి సవిత మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదని అన్నారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోలియో కేంద్రాలు, మొబైల్ బృందాల ద్వారా బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పోలియో చుక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్ను శాశ్వతంగా పోలియో రహిత రాష్ట్రంగా కొనసాగిస్తామని విశ్వాసం మంత్రి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాగవంచ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ సింగం వెంకన్న, డివిజన్ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు

## రెండు చుక్కల పోలియో మందు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట

### పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- పల్స్ పోలియో సందర్భంగా ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అందించే రెండు చుక్కల పోలియో మందు వారి బంగారు భవిష్యత్తుకు బాట అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. పోలియో వచ్చిన తర్వాత నయం చేయలేమని, రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయన్నారు.ఆదివారం ఉదయం తూర్పు లోని అశోక్ నగర్లోని శాంతి స్కూల్లో పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ పోలియో రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యత అని చెప్పారు. పోలియో వస్తే పిల్లలు జీవితాంతం నడవలేరని, అందువల్ల ముందుజాగ్రత్తగా రెండు పోలియో చుక్కల వేయిస్తే వారు సురక్షితంగా ఉంటారన్నారు. మన దేశంలో పోలియో కేసులు నమోదు కావడం లేదని కాని పొరుగు దేశల నుంచి వైరస్ వచ్చే అవకాశం ఉందని. అందువల్ల ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. పోలియో వచ్చిన తర్వాత నయం చేయలేమని అందువల్ల రాకుండా నివారించాలని అందుకు ఈ రెండు పోలియో చుక్కలతో పోలియో రాకుండా జాగ్రత్త పడవచ్చునని గద్దె చెప్పారు. పిల్లలకు జ్వరం ఉన్నా, గతంలో ఈ చుక్కల మందు వేయించినా ఈ రెండు చుక్కల పోలియో మందు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. పోలియో రాకుండా రెండు చుక్కల మందు ఒక్కటే శరణ్యమని ఎమ్మెల్యే గద్దె అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీమ్, మేదరమెట్ల నారాయణ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పఠాన్ బాజీ, కార్పొరేషన్ ఎంహెచ్వో గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిఎంఎస్ లో అక్రమాలు అవాస్తవం

**: డిసిఎంఎస్ ఇన్ చార్జి మేనేజర్**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం డిసిఎంఎస్ అక్రమాలు అవాస్తవం అని డిసిఎంఎస్ ఇన్ చార్జి మేనేజర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రతికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం డిసిఎంఎస్ కి సంబంధించి వడ్ల కొనుగోలులో అక్రమాలు అనే శీర్షికపై వివరణ ఇచ్చారు. డిసిఎంఎస్ ఖమ్మం ఆధ్వర్యంలో చేసిన వడ్ల కొనుగోలు గత నాలుగు సంవత్సరాలలో చేసిన వ్యాపారం విలువ కేవలం నాలుగు కోట్ల మాత్రమే అని తెలిపారు. వడ్ల కోనుగోలు లో రూ పది కోట్లకు పైగా అక్రమాలు అనేది పూర్తిగా అవాస్తవం అని తెలిపారు. ఏఓ, ఏఈఓ ల లాగిన్ ఐడిలు కేవలం ఏఓ, ఏఈఓ ల ఆధార్ కార్డు కి అనుసంధానం మై ఉండటం వలన ప్రతి సందర్భంలో వారికి మాత్రమే ఓటిపి వెళ్ళుతుంది. కావున వారి ఐడిలు అనే మాట పూర్తిగా అవాస్తవం అని వివరించారు. వడ్ల కొనుగోలు సమయంలో రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకుని వచ్చిన ధాన్యాన్ని కి ఎటువంటి తరగు ఉండదు అని తెలిపారు. కేవలం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ధాన్యానికి మాత్రమే తరుగు అనేది రైతుల ఇష్టపూర్వకంగా తీయటం జరుగుతుంది అని తెలిపారు. ధాన్యం తరుగులకు డిసిఎంఎస్ సంస్థకు ఎటువంటి సంబంధం లేదు అని తెలిపారు. వడ్ల కోనుగోలు ప్రక్రియలో భాగంగా ముందుగా పిఏసిఎస్ ద్వారా కోనుగోలు కేంద్రాల ఫోటోలు, మౌలిక వసతులు ఇతర విషయాలు ఆన్ లైన్ నందు అప్లోడ్ చేయటం జరుగుతుంది అని తెలిపారు. ఓపి ఎం ఎస్ ద్వారా రైతుల యొక్క రిజిస్ట్రేషన్ ను, ధ్యానం కోనుగోలు చేసిన అనంతరమే మిల్లులకు ధ్యానం సరఫరా చేయటం జరుగుతుంది అని తెలిపారు.ఆన్ లైన్ ద్వారానే సంబంధిత మిల్లులు ధ్యానం దిగుమతి యొక్క ఆమోదం తెలుపుతారు అని తెలిపారు. మిల్లురు యొక్క ఆమోదం తరువాత సివిల్ సప్లయ్ వారు ఆన్ లైన్ ద్వారానే రైతుల ధ్యానానికి సంబంధించిన నగదును రైతుల ఖాతాలోనే నేరుగా జమ చేయటం జరుగుతుంది అని తెలిపారు. ఇందులో ఎటువంటి అక్రమాలకు తావు ఉండదు అని తెలిపారు. ధ్యానం కోనుగోలు నిర్వహణ ప్రక్రియ పూర్తిగా ఆన్ లైన్ లో మాత్రమే జరుగుతుంది అని తెలిపారు. ధాన్యం కొనుగోలు మొత్తం ప్రక్రియలో సివిల్ సప్లై శాఖ అధికారులు మండల స్పెషల్ ఆఫీసర్లు తహసిల్దారు మరియు రెవెన్యూ శాఖ సిబ్బంది ఇతర ప్రభుత్వ అధికారుల యొక్క నిరంతరణ పర్యవేక్షణలో మాత్రమే జరుగుతుంది.ధాన్యం కొనుగోలు ప్రక్రియ నందు ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు.డిసిఎంఎస్ ఖమ్మం నందు పని చేస్తున్న సిబ్బంది గత ఎనిమిది సంవత్సరాలుగా సంస్థ యొక్క అభివృద్ధి కోసం పని చేస్తున్నారన్నారు. ఎప్పటికైనా తమను రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తిస్తుంది అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. డిసిఎంఎస్ సంస్థ గతంలో వ్యాపార నిర్వహణ కోసం రూ పది కోట్లకు అప్పులు చేసింది అని తెలిపారు. గతంలో చేసిన అప్పుల్లో సుమారు నాలుగు కోట్ల రూపాయల అప్పులు వివిధ కార్పోరేషన్లులకు , బ్యాంకులకు చెల్లించటం జరిగింది అని తెలిపారు. అదే విధంగా గత పదహారు సంవత్సరాల నుండి డిసిఎంఎస్ ఖమ్మం నందు పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు, చనిపోయిన ఉద్యోగులకు సంబంధించిన పాత బకాయిలు అయినటువంటి జీతాలు, పిఎఫ్, గ్రాడ్యూటీలు, పెన్షన్లు, ఇతర బకాయిలు సుమారు కోటి రూపాయల మేర చెల్లించటం జరిగింది అని తెలిపారు. డిసిఎంఎస్ ఖమ్మం వారు ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వడ్ల కోనుగోలు, మొక్కజొన్న కోనుగోలు, కందులు, పెసలు కోనుగోలు ఎరువులు, విత్తనాలు , పురుగు మందుల వ్యాపారం నిర్వహిస్తోంది అని తెలిపారు. ప్రభుత్వ ఆదేశించిన ప్రతి వ్యాపారాన్ని ఎటువంటి అవకతవకలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావాలని కొందరు డిసిఎంఎస్ సంస్థ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు అని తెలిపారు. సంస్థ పై బురద జల్లే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోనేందుకు డిసిఎంఎస్ సంస్థ సిద్ధం అవుతోంది అని తెలిపారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు
## పల్స్ పోలియో కార్యక్రమంలో బొమ్మదేవర రత్నకుమారి




విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- పల్స్ పోలియో-నిండు జీవితానికి రెండు చుక్కలు. 0-5 సంవత్సరాల చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో రెండు చుక్కలు వేయించాలి అనే ప్రభుత్వ ప్రతిష్టాత్మిక నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 58వ డివిజన్, కృష్ణ హోటల్ సెంటర్ వద్ద ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో శిబిరంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని రత్నకుమారి పేర్కొన్నారు.తల్లిదండ్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ చిన్నారులను సమీపంలోని పోలియో బూత్‌లకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా చేయాలని రత్నకుమారి అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత విజయవాడ శాఖ ఆధ్వర్యంలో
## జూలై 5వ తేదీన ఘనంగా ప్రతిభా పురస్కారాల కార్యక్రమం



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- మానవత స్వచ్ఛంద సేవాసంస్థ విజయవాడ శాఖ గవర్నర్ పేటలోని ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆఫీస్ లో ఆదివారం ఉదయం విజయవాడ శాఖ అధ్యక్షులు పగిడిపల్లి రాము ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి దావులూరి సాంబశివరావు మాట్లాడుతూ ఈ నెలలో జరిగిన సేవా కార్యక్రమాలను గురించి నివేదిక ను సమర్పించారు. క్రొత్త సభ్యత్వల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయుటకు గౌరవ సభ్యులకు జులై 15 వరకు సమయాన్ని పొడిగించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమాన్ని జూలై 5న విజయవాడ గవర్నర్ పేటలోని స్వాతంత్ర సమరయోధుల భవనంలో ఉదయం 9 గంటల 30 నిమిషాలకు నిర్వహిస్తామని తెలిపారు. మానవత విజయవాడ శాఖకు అనేక రకాలుగా సేవా కార్యక్రమాలకు, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వారిని, సభ్యత్వాలను పూర్తి చేసిన వారిని డైరెక్టర్లుగా నియమించారు. మానవత శాఖ విజయవాడ నుండి జూలై 5వ తేదీన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ముగ్గురు పేద విద్యార్థులకు తమ చదువుల కొరకు ఆర్థిక సహాయం అందజేస్తామని దావులూరి సాంబశివరావు తెలిపారు. అనంతరం పగిడిపల్లి రాము మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వృద్ధాశ్రమాలకు మెడికల్ పరికరాలను, వికలాంగులకు, నిరు పేదలకు ఆర్థిక సహాయాన్ని, వైద్య ఖర్చులను అందజేస్తున్నామని, పేద విద్యార్థులకు ల్యాప్ టాప్ లను, ఫీజులను, బుక్స్ ను అందజేస్తున్నామని, నిరు పేద కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా చనిపోతే తమ సంస్థ ద్వారా ఉచితంగా మహాప్రస్థానం వాహనాన్ని పంపిస్తున్నామని, దానితో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని, అలాగే గవర్నమెంట్ స్కూల్స్ లోని 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభా పురస్కారాల పేరిట నగదుతో పాటు మోమెంటో, సర్టిఫికేట్ లను జూలై 5వ తేదీన అందజేస్తామని రాము తెలిపారు. నందిగామ రఘునాథం, నేమాని కామేశ్వరి లు మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించేందుకు హోమియోపతి, ఆయుర్వేద మందుల ప్రాముఖ్యతను వివరించారు. మోతుకూరి వేంకటేశ్వర రావు, కె.వి. శ్రీనివాస్ రావు లు మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు, రంగు వెంకట దుర్గా ప్రసాద్, కోగంటి సుశీల, సుంకర సుభాష్ చంద్రబోస్, ముప్వ శైలజ, నాదెళ్ల సుమతి, ఎ. యశోద, మేడిశెట్టి వెంకట నారాయణ, దూరదర్శన్ కేంద్రం ప్రముఖులు రవీంద్ర, ప్రసాద్, ఐ. నాగరాజు, జె. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 3వ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే
## పోటీల గోడ పత్రిక ఆవిష్కరించిన సినీ హీరో సుమన్..!!




( నేటి శుభోదయ జూన్ 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) వాడోకాయ్ కరాటే డు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు సతీష్ కుమార్ ఆద్వర్యంలో హెచ్.బి కోలనీ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ హాల్లో సినీ హీరో సుమన్ యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, బిజేపి రాష్ట్ర నేత కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా కరాటే రాష్ట్ర స్థాయి పోటీల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు ఇరవై రెండు, ఇరవై మూడవ తేదీల్లో విశాఖ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో మూడవ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తామని అన్నారు.క్రీడలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు,కోచ్లు ఆనందబాలు,అగస్త్య, కిషోర్, రాము,గోవర్ధన్,అంబు , నాగేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఏజిఆర్ కరాటే అకాడమీ ప్రారంభించిన సినీ హీరో సుమన్..!!



( నేటి శుభోదయ జూన్ : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక చిన్నవయసులోనే పిల్లలోని క్రీడా నైపుణ్యం గుర్తించే విధంగా తల్లితండ్రులు చొరవ తీసుకోవాలని భారత వాడోకై కరాటే డు అసోసియేషన్ చైర్మన్ మరియు సిని హీరో సుమన్ తల్వార్,రాష్ట్ర బీజేపీ మీడియా పెనలిస్ట్, గాజువాక బీజేపీ కన్వినర్ కర్ణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ మేరకు కుర్మన్నపాలెం లో ఏజిఆర్ స్పోర్ట్స్ అకాడమీ ని ప్రారంభించారు. ఏజిఆర్ స్పోర్ట్స్ సభ్యులు అన్ను, సరస్వతి,రాజేశ్వరి, గోవర్ధన్ సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమనికి సినీ హీరో సుమన్ తల్వార్, బీజేపీ రాష్ట్ర మీడియా పెనలిస్ట్ కర్ణంరెడ్డి నర్సింగరావు ముఖ్య అధితులు గా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఏజిఆర్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పోర్ట్స్ అకాడమీ అనేది క్రీడాకారులకు వృత్తిపరమైన శిక్షణ,అత్యాధునికి వసతులు మరియు శారీరక దృఢత్వాన్ని అందించే ఒక ప్రత్యేకమైన శిక్షణ కేంద్రం అని అట్టడుగు స్థాయి నుండి ప్రతిభను గుర్తించి వారిని జాతీయ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం లో అకాడమీ తొడ్పాడుతుంది అన్నారు. అనుభవిజ్ఞులైన కోచ్ ల ద్వారా శిక్షణ ఇస్తున్నాం అన్నారు.పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కరాటే ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ లు బోండా జగన్, లేళ్ళ కోటేశ్వరావు, సతీష్ కుమార్,రాము,వేంకటాద్రి, డీజే ఆర్ కే రాజు,ఎండీ మొబీన్,రాణి, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు పార్లమెంట్ అబ్జర్వర్ ఎమ్మెల్యే
## 'బత్తుల'ను కలిసిన ఆయా నియోజకవర్గ జనసేన నేతలు

**- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణని వారి స్వగ్రామం గాదరాడలో మర్యాదపూర్వకంగా కలిసిన ఏలూరు పార్లమెంట్ పరిధిలోని జనసేన నాయకులు..!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) జనసేన పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ నూతన నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తిచేద్దాం.. పవన్ కళ్యాణ్ మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేద్దాం..సమాచార సేకరణను శ్రేణులు అందరికీ తెలిసేలా చేయాల్సిన భాధ్యత అందరిపై ఉందని ఏలూరు పార్లమెంట్ అబ్జర్వర్ అయిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలను తూచా తప్పకుండా నిస్పక్షపాతంగా వ్యవహరించి పార్టీ నిర్మాణానికి సహకరించాలని శ్రేణులకు ఎమ్మెల్యే 'బత్తుల' దశాదిశా నిర్దేశం చేసారు.ఏలూరు పార్లమెంట్ జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ అబ్జర్వర్ గా నియమితులైన రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణని ఆదివారం వారి స్వగ్రామం గాదరాడ గ్రామంలో మర్యాదపూర్వకంగా ఏలూరు పార్లమెంట్ పరిధి నాయకులు కలిశారు. రేపటి నుండి రాష్ట్రవ్యాప్తంగా, ఏలూరు పార్లమెంట్ పరిధిలోనూ చేపట్టనున్న జనసేన పార్టీ నిర్మాణానికి సంబంధించి పలు విషయాలను ఎలా చేపట్టాలనే విషయంపై చిన్నపాటి చర్చ జరిపారు. అనంతరం మరికొన్ని గంటల్లో పూర్తి షెడ్యూల్ విడుదల చేసి కమిటీలోని మిగిలిన 31 మందితో సమన్వయం ఏర్పరుచుకుని రూట్ మ్యాప్ తయారుచేసి 7 నియోజకవర్గాలు పర్యటించి స్థానికంగా అక్కడున్న రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, మండల కమిటీ, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ లు, డైరెక్టర్ లు అందరికీ సమాచారం తెలిసేలా సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ షెడ్యూల్ కు సమాయత్తం కావాలని, పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం కాదలిచిన వారికి తగిన ప్రొఫైల్ రెడీ చేసుకునే విధంగా అందరికీ సమాచారం ఇవ్వాలని శ్రేణులకు ఎమ్మెల్యే బత్తుల పిలుపు నిచ్చారు. అదేవిధంగా పార్టీ ఆవిర్భావం నుండి ఇటీవల కాలం వరకు కష్టపడిన వారు ప్రతీ ఒక్కరికీ సమాచారం తెలిసేలా చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా శ్రేణులకు ఎమ్మెల్యే 'బత్తుల' గుర్తుచేశారు. ఎమ్మెల్యే 'బత్తుల' కమిటీలో మిగిలిన సభ్యుల నియోజకవర్గాల పర్యటన పూర్తి షెడ్యూల్ మరికొన్ని గంటల్లో విడుదల జేస్తామని తెలియజేసారు.

## హీరో సుమన్ కి ఘనంగా సన్మానం..!!




( నేటి శుభోదయ జూన్ : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఆంధ్ర రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ గా నియమితులైన తర్వాత మొదటి సారిగా విశాఖపట్నం వచ్చిన ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ కి విశాఖపట్నం హెచ్.బి కోలనీ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఘణంగా సత్కరించారు. ముఖ్య అతిధిగా యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ , గౌరవ అతిథిగా బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సినీ , టెలివిజన్, నాటక రంగాన్ని అభివృద్ధి చేస్తుందని అన్నారు. హీరో సుమన్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మరియు తనకు ఈ పదవి రావడానికి సహకరించిన హీరో మరియు హిందూ పురం శాసన సభ్యుడు బాలకృష్ణ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం అమరావతిలో సినీ , టెలివిజన్, నాటక రంగాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు ,ఆనందబాలు,అగస్త్య, కిషోర్,రాము,అంబు,నాగేశ్వరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అనుభవానికి అక్షరరూపం. 'వెంకయ్య నాయకుడు'
## పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):-విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్‌లో సీనియర్ పాత్రికేయులు శ్రీ మా శర్మ రచించిన 'వెంకయ్య నాయకుడు' పుస్తక పరిచయ వేడుక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విశిష్ట ముద్ర వేసిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఐదు దశాబ్దాలకు పైబడిన ప్రజా, రాజకీయ జీవిత అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇటువంటి గ్రంథాలు నేటి యువతకు, రాజకీయ కార్యకర్తలకు, ప్రజా జీవితంలోకి రావాలనుకునే వారికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఉమా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్ , గద్దె రామ్మోహన్ రావు , వై.ఎస్. చౌదరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారత్ ప్రధాని మోదీ లక్ష్యం..!!

**- బిజేపి నేత కే, ఎన్, ఆర్**



( నేటి శుభోదయ జూన్ : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా పిల్లలకు వేయించాలని బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు . గాజువాక పాతకర్నవానిపాలెం సామాజిక భవనంలో రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కేఎన్ఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న కొంత మంది చిన్న పిల్లలకు రెండేసి పోలియో చుక్కలు వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత భారత దేశమే ప్రధాని నరేంద్ర మోదీ మరియు కూటమి ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ పూర్ణకుమారి,ఏఎన్ఎమ్ ముంతాజ్ బేగం ,ఆశా వర్కర్లు ,బిజేపి నాయకులు నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లో పిల్లలను గమనిస్తూ ఉండాలి

**చెల్లిని కాపాడి అన్న మృతి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- విద్యాసంస్థలకు సెలవు రోజుల్లో పిల్లలు ఎక్కడకు వెళుతున్నారు, ఏమీ చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. పకీరుగూడెంలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని అన్నారు.తూర్పులోని 19వ డివిజన్ పకీరూగూడెంలో మహమ్మద్ సబీర్ అనే బాలుడు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించాడు. ఈ విషయాన్ని తెల్సుకున్న ఎమ్మెల్యే గద్దె వెంటనే స్పందించి సబీర్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందచేశారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజు కావడంతో సరదాగా సబీర్ తన చెల్లితో కలిసి కాలువలో చేపల వేటకు వెళ్ళాడని, నీటిలో చెల్లి పడిపోవడంతో ఆమెను కాపాడి సబీర్ నీట మునిగి చనిపోవడం దురదృష్టకరమన్నారు. నీటిలో మునిగిపోతున్న చెల్లిని కాపాడి అన్న మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. సెలవు రోజుల్లో పిల్లలు ఎక్కడి వెళుతున్నారు, ఏ విధమైన ఆటలు ఆడుతున్నారనే విషయాలన్ని తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలని గద్దె చెప్పారు. ప్రమాదానికి కారణం అయిన కాలువ దగ్గర రక్షణ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, భాగం సాయిప్రసాద్, ఎస్.కె కలాం, ఎండి జలీల్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రెండు చుక్కల పోలియో మందు.
## చిన్నారుల భవిష్యత్తుకు బాట అక్కల రామ మోహన్ రావు



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):- మైలవరం లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం ఇన్ ఛార్జ్ జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ మోహన్ రావు (గాంధి) పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసారు.ఈ సందర్భంగా అక్కల రామ మోహన్ రావు మాట్లాడుతూ పోలియో రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యత అని గాంధీ చెప్పారు. పోలియో వస్తే పిల్లలు జీవితాంతం నడవలేరని, అందువల్ల ముందు జాగ్రత్తగా రెండు పోలియో చుక్కల వేయిస్తే వారు సురక్షితంగా ఉంటారన్నారు. అందువల్ల ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. పోలియో వచ్చిన తర్వాత నయం చేయలేమని అందువల్ల రాకుండా నివారించాలని అందుకు ఈ రెండు పోలియో చుక్కలతో పోలియో రాకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు. పిల్లలకు జ్వరం ఉన్నా, గతంలో ఈ చుక్కల మందు వేయించినా ఈ రెండు చుక్కల పోలియో మందు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని రామ మోహన్ రావు అన్నారు.

## ఎం.వీ.పీ కాలనీలో ఘనంగా ప్రారంభమైన "డిజిటల్ కుక్‌వేర్ షాప్..!!




(నేటి శుభోదయ జూన్ :29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్) నగరానికి చెందిన డిజిటల్ వీడియోస్ సంస్థ వారి అద్వర్యంలో విశాఖపట్నంలోని ఎం.వీ.పీ కాలనీలో " డిజిటల్ కుక్‌వేర్ షాప్" ను జాతీయ అవార్డు గ్రహీత , దర్శకుడు , సామజిక సేవ తత్పరుడు, రచయత డా. మణి భూషణ్ మరియు పలువురు ప్రముఖులు , వినియోగదారుల సమక్షంలో అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. మణి భూషణ్ మాట్లాడుతూ, జర్మనీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఏ.ఎం.సీ కుక్‌వేర్ సంస్థకు తాము అధీకృత ప్రమోటర్ మరియు సేల్స్ భాగస్వాములు అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 60 సంవత్సరాలుగా విశ్వసనీయ సేవలను అందిస్తున్న ఈ సంస్థ, భారతదేశంలో కూడా 30 సంవత్సరాల విజయవంతమైన సేవలను పూర్తి చేసుకుని, లక్షలాది కుటుంబాల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. ఏ.ఎం.సీ కుక్‌వేర్ ద్వారా నీరు లేకుండా, నూనె లేకుండా వంట చేయడం సాధ్యమవుతుందని, తద్వారా ఆహారంలోని పోషక విలువలు, విటమిన్లు, సహజ రుచి పూర్తిగా నిల్వ ఉంటాయని తెలిపారు. అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలతో పాటు ఆధునిక డిజిటల్ కుకింగ్ టెక్నాలజీతో రూపొందించబడిన ఈ ఉత్పత్తులు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ఈ ఉత్పత్తిపై ఆసక్తి ఉన్న ప్రతి కుటుంబానికి ఉచిత హోమ్ డెమో అందిస్తున్నామని, 98484 18582 నంబర్‌కు సంప్రదించి తమ ఇంటివద్దే ప్రత్యక్ష ప్రదర్శన పొందవచ్చని తెలిపారు. ప్రతి కుటుంబం ఈ అత్యుత్తమ ఏ.ఎం.సీ కుక్‌వేర్‌ను సులభంగా కొనుగోలు చేయడానికి బజాజ్ ఫైనాన్స్ ద్వారా సులభమైన ఈఎంఐ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అంతేకాకుండా, ఈ ఉత్పత్తికి 30 సంవత్సరాల వారంటీ కూడా లభిస్తుందని చెప్పారు. వివాహాలు, గృహప్రవేశాలు, వార్షికోత్సవాలు, పుట్టినరోజులు వంటి శుభకార్యాలకు ఏ ఎం సి సీ కుక్‌వేర్ ఒక అద్భుతమైన బహుమతి అని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వెడ్డింగ్ గిఫ్ట్ సెట్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు 150 రకాల అంత్యంత ప్రమాణాలతో తయారయిన వంటపాత్రలు అందుబాటులో ఉన్నాయని . విశాఖపట్నం ప్రజలందరూ డిజిటల్ కుక్‌వేర్ షాప్‌ను సందర్శించి, ఈ వినూత్న వంట సాంకేతికతను ప్రత్యక్షంగా అనుభవించాలని ఆయన కోరారు. సరికొత్తగా కాల్ ఆన్ కిచెన్ అనే కాన్సెప్ట్ తో మీ వంటయింటి సౌకర్యం కోసం , ఆరోగ్యకరమైన వంటకు , స్మార్ట్ జీవనవిధానాన్ని అందరికి పంచె అవగాహనా కార్యక్రమం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు, వినియోగదారులు, శ్రేయోభిలాషులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ డా. మణి భూషణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇబ్రహీంపట్నం గవర్నమెంట్ ఆస్పత్రిలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ చిట్టిబాబు, కమీషనర్ శ్రీనివాసులు



విజయవాడ, జూన్ 28 (నేటి శుభోదయ):-ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో,15వ డివిజన్ లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొండపల్లి మున్సిపాల్ చైర్మన్ చిట్టిబాబు, మున్సిపల్ కమీషనర్ బి. శ్రీనివాసులు సంయుక్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు ప్రతి పిల్లవాడికి పోలియో చుక్కలు తప్పనిసరి అని,పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఇదే మొదటి మెట్టు అని అన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేసుకొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు ఉప్పతల గోపాలరావు, పులి దాసు, ఆస్పత్రి వైద్యులు,నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిండు ప్రాణానికి - రెండు చుక్కలు..!!




( నేటి శుభోదయ జూన్ :29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెదగంట్యాడ : పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మాజీ కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి అన్నారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవ కార్యక్రమాన్ని నెహ్రూ నగర్ ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 74 వ వార్డు మాజీ కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి పాల్గొని అప్పుడే పుట్టిన పిల్లలు నుండి ఐదు సంవత్సరల లోపు పిల్లల వరకు పల్స్ పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉండాలంటే పల్స్ పోలియో రెండు చుక్కలు తప్పనిసరిగా వేయాలని పోలియోను పూర్తిగా నిర్మూలించాలంటే 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో మందు వేయించాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను సమీప పోలియో కేంద్రానికి తీసుకువచ్చి ఈ రెండు చుక్కలు వేయించాలని కోరారు .

## దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్...



( నేటి శుభోదయ జూన్ :29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్నలిస్ట్ లిస్టులే.!!సుప్రీం కోర్ట్ ఇకపై కావాలనే కక్ష్య తో రాజకీయ నాయకులు,అక్రమ సంపాదన దందాలు చేసే వారు,వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరావు:సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్,యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్,ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని,వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై,అట్టి పోలీస్ లపై వేట తప్పదు:సుప్రీం కోర్ట్.

## విశాఖ స్టీల్ ప్రమాదానికి జాతీయ స్టీల్ సెక్రటరీ ని బాధ్యుని చెయ్యాలని..!!

**- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్....**




( నేటి శుభోదయ జూన్:29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగం లోనే కొనసాగించాలని జీవీఎంసీ ఎదురు గా 1916 వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షలలో భాగంగా ఈ రోజు ఏఐటీయూసీ మరియు రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన నుద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు జె. రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ను ప్రభుత్వ రంగం లోనే కొనసాగిస్తామని పార్లమెంట్ సాక్షి గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ది.08-06-2026 న విశాఖ ఉక్కు లో జరిగిన ఘటనకు జాతీయ స్టీల్ సెక్రటరీ ని బాధ్యుడు గా చేయాలని కూడా డిమాండ్ చేస్తూ అన్ని తన కనుసన్నలలో జరగాలని డిల్లీ నుండి ఆజ్ఞలు జారీ చేస్తూ సేఫ్టీ తదితర అంశాలకు పని ప్రదేశాలలో ప్రాధాన్యత తగ్గించడమే కాక ఏ గణాంకాలు లేకుండా కార్మికులను తగ్గిస్తూ ఒక్క కలం పోటు తో దాదాపు 6000 మంది అనుభవజ్ఞులైన కాంట్రాక్ట్ కార్మికులను తీసేసి, దీనివలన ఎక్కువ మంది నిర్వాసితులకు అన్యాయం జరగగా ఉన్న కార్మికులపై పనిభారం మరియు ఒత్తిడి పెంచడం వలన, మరోప్రక్క కొరవడిన నాణ్యతా ప్రమాణాల బేరీజు వేయడం రోజు రోజు జరుగుతున్న ప్రమాదాలకు కారణాలు.ప్రమాదంలో మరణించిన వారికి కోటి రూపాయలు, క్షత గాత్రులకు 50 లక్షల రూపాయలు చెల్లించాలని,సేఫ్టీ ప్రమాణాలు విధిగా పాటించాలని డిమాండ్ చేశారు... ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు కోట్ల పైన నష్టపరిహారం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రకటన లు చేసి ప్రజల వద్ద నుండి సానుభూతి పొందాలని చూడడం సిగ్గుచేటని నేటికీ మరణించిన లేదా క్షతగాత్రులైన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం చేయకుండా నవ్విపోదురు కదా నాకేంటి సిగ్గు అన్నట్టు ప్రభుత్వ మంత్రులు అబద్దాలను అసత్యాలను మూటగట్టి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని నిజంగా ప్రభుత్వ మంత్రులు ప్రకటన నిజమైతే మృతుల కుటుంబాల దగ్గరికి వచ్చి రెండు కోట్ల రూపాయలు నష్టపరియాల మాకు వచ్చిందని చెప్పించగల దమ్ము ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు ఏఐటీయూసీ నాయకులు కాసా రమణ మూర్తి, మాత గోవింద్, జగదీష్, పల్లా శంకర్, డోలా ప్రసాద్, రాజు, రిటైర్డ్ పెన్షనర్స్ సంఘం నాయకులు కె. సుధాకర్, సూర్యచంద్ర రావు, రంగ మరియు రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు...

## "పోలియో మహమ్మారిని తరిమికొడదాం ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి"



పెంటపాడు జూన్ 28 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::పోలియో చుక్కలు ప్రతి ఒక్క చిన్నారులకు వేయించాలని పోలియో మహమ్మారిని తరిమి కొడదామని పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం పెంటపాడు, ముదునూరు ఆరోగ్య కేంద్రం లలో చిన్నారులకు పోలియో చుక్కలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరు బలపరచాలని ఆమె అన్నారు. ప్రతి తల్లిదండ్రులు చిన్నారులకు సమీపంలో ఉన్న పోలియో కేంద్రాలకు వెళ్లి తక్షణమే పోలియో చుక్కలు వేయించాలని ఆమె తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పల్స్ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతులుగా పిల్లలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డు మేంబరు కసిరెడ్డి మధులత, ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణ్ రెడ్డి, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, దారపురెడ్డి శ్రీనివాస్, డాక్టర్లు,ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి..

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**




నేటి శుభోదయ జూన్ : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో -- 2026 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన జీవీఎంసీ సౌత్ జోనల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ బూత్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ తో కలిసి సందర్శించి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడిన కమిషనర్, 0 నుండి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని , పోలియో చుక్కలు చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ తో పాటు ఆరోగ్యవంతమైన భావితరాలకు మనందరి బాధ్యత అని సూచించారు. పోలియో వ్యాధి నుంచి శాశ్వత రక్షణ కల్పించడంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, గతంలో పోలియో టీకాలు తీసుకున్నప్పటికీ ఈ ప్రత్యేక కార్యక్రమంలో మళ్లీ పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని కమిషనర్ తెలిపారు.జీవీఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన అన్ని పల్స్ పోలియో బూత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఏ చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అలాగే బూత్‌కు రాలేని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలు సేవలు అందిస్తాయని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు.పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని కమిషనర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కోడుమూరు జూన్ 28 :కర్నూలు మండలం పసుపుల గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కల కేంద్రాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజలు ఆరోగ్య శాఖ అధికారులకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.



## కోడుమూరు పట్టణంలో " కాఫీ విత్ కార్యకర్త కార్యక్రమంలో సంధ్యా విక్రమ్ కుమార్



కోడుమూరు జూన్ 28: కోడుమూరు పట్టణంలోని 1 వ వార్డ్ సుందరయ్య నగర్ వాసులతో ఆత్మీయంగా సమావేశం అయినా కోడుమూరు నియోజవర్గ జనసేనా నాయకులు ఈ సందర్భంగా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ జనసేనా పార్టీ బలోపేతానికి మనమంతా కలిసికట్టుగా పని చేద్దాము అయన



అన్నారు ఈరోజు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవను కూటమి ప్రభుత్వం చెస్తున్న అభివృద్ధిని ప్రతి గడపకు తీసుకొని పోయి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యేదిక స్థానాలు గెలిచి పవన్ సార్ కు కానుక ఇద్దాము అని ఆయన పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాముడు సుంకన్న ప్రతాప్ రెడ్డి సూరి రంగడు లింగన్న భాష మరియు భారీగా కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు

## మద్యం మత్తులో భార్యను హత్య చేసిన భర్త

**డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఇనుపరాడ్‌తో దాడి**

కళ్యాణదుర్గం : మద్యం వ్యసనం కుటుంబంలో విషాదాన్ని నింపింది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంతో భర్త భార్యను ఇనుపరాడ్‌తో కొట్టి హత్య చేసిన ఘటన శెట్టూరు మండలం మంగంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన తిప్పేస్వామి మద్యానికి బానిసై తరచూ భార్య మమత(38)తో గొడవపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఇంటికి వచ్చిన తిప్పేస్వామి.. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.ఆగ్రహానికి లోనైన తిప్పేస్వామి ఇంట్లో ఉన్న ఇనుపరాడ్‌తో మమతపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న మమత.. భర్త మద్య వ్యసనానికి బలవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న శెట్టూరు ఎస్ఐ సుమన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.హత్య అనంతరం తిప్పేస్వామి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

## 0 - 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ..**

**పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి**

అనంతపురం: అనంతపురం నగరంలోని కోర్టు రోడ్ లో ఉన్న నెహ్రూ మునిసిపాలిటీ కార్పొరేషన్ స్కూల్ లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, మరియు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, తదితరులు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల మధ్యనున్న ప్రతి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో చుక్కలు వేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రజలందరూ ఉచితంగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు రెండు చుక్కలు వేయించి అంగవైకల్యం నుంచి రక్షించాలని, వారి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఎన్ని పనులు ఉన్నా ఈరోజు తప్పకుండా పిల్లలకి పల్స్ పోలియో వేయించాలని తెలిపారు.ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని.. 5ఏళ్ల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. 100 శాతం నిర్మూలనకు మనం దగ్గర్లో ఉన్నామని.. ఇంకా కొంత మంది అవగాహన లేకనో లేదా నిర్లక్ష్యంతోనే ఉంటున్నారన్నారు. అందుకే 5ఏళ్ల లోపు పిల్లలు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో 2,83,430 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశారన్నారు. మొత్తం 1,623 కేంద్రాలతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్లు ఇలా అన్ని చోట్ల పోలియో చుక్కలు వేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంతరావు, యంఎచ్ఓ సునీత, జిల్లా ఇమ్యునైజేషన్ ఇంచార్జ్ అధికారి డాక్టర్ ప్రసన్న భారతి, డెమో నాగరాజు, ఎచ్ఈఓ గంగాధర్, ఏఎస్ఓ ప్రవీణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

**0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలి.**

**జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్**

అనంతపురం: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం కమలానగర్ లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని కొంతమంది చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలియోరహితసమాజ నిర్మాణమే లక్ష్యమని ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పిల్లలకు వేయించే ఈ రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా జీవితాం తం రక్షిస్తాయన్నారు. భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర వైద్యారోగ్య శాఖలు ఐదు సంవత్సరాల లోపు పిల్ల లందరికీ ప్రాణాంతక వ్యాధి నుండి శాశ్వత రక్షణను అందించడానికి ప్రత్యేక పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పోలియోను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసే విధంగా కార్యక్రమం నిర్వహణకు ముందస్తు చర్యలు తీసుకొని సిబ్బందికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 16 23 పోలింగ్ బూతులలో సుమారు 2, 83,430మంది పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రధాన కూడళ్లు బస్టాండ్లు ,రైల్వేస్టేషన్, స్థానిక ప్రాథమిక కేంద్రాలు అంగన్వాడీలు మరియు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ, పట్టణ శివారు తదితర ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా పోలియో టీకాలు వేయడం జరుగుతున్నదన్నారు. దాదాపు 200 దేశాలలో పోలియో పూర్తిగా నిర్మూలించబడిందని అయితే ఒకటి లేదా రెండు దేశాల్లో ఇప్పటికీ ఈ వైరస్ ఉండడం వల్ల ప్రపంచం మొత్తం పోలియో రహితంగా మారే వరకు నిరంతర అప్రమత్తత, టీకాల పంపిణీ అవసరమని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలు అంగవైక ల్యాలకు గురికాకుండాకాపాడే విధంగా పల్స్ పోలియో బాధ్యతగా కార్యక్రమాలలో పాల్గొని విజయంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న వారు విధి నిర్వహణలో భాగంగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించద్దని సూచించారు. ఈ కార్యక్రమంలోడా .శ్రావణి , మున్సిపల్ ఎంహెచ్ఓ సునీత, ఏఎస్ఓ ప్రవీణ్ కుమార్ హెచ్ ఈ ఓనాగలక్ష్మి , పిల్లలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం..

## శ్రీ శాంత కళ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం

ధర్మవరం :పేద ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యము అని శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణములోని తొగట వీధిలో గల శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయమునందు పేద ప్రజల కొరకు 124వ ఉచిత వైద్య చికిత్స శిబిరమును క్యాంపు చైర్మన్ దాసరి వెంకటేశులు (చిట్టి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరములుగా ఈ ఉచిత వైద్య చికిత్స శిబిరములను దాతల సహాయ సహకారములతో నిర్వహిస్తున్నామని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేటి ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు దాసరి ఓబులమ్మ, కీర్తిశేషులు దాసరి నారప్ప జాపకార్థం వీరి కుమారుడు దాసరి ప్రమీల, దాసరి మంజునాథ్ అండ్ సన్స్ వారు వ్యవహరించడం జరిగిందని తెలిపారు. నిష్ణాతులైన వైద్యులైన డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ జైదీప్ నేత, డాక్టర్ విట్టల్, డాక్టర్ ప్రణయ్, డాక్టర్ వినయ్ రచయిత రోగులకు.

## టీఎన్‌సీసీ నూతన అధ్యక్షుడిగా మాణిక్యం ఠాగూర్



చెన్నై: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మాణిక్యం ఠాగూర్(51) నియమితులయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న కె. సెల్వపెరుంతగై తనను టీఎన్‌సీసీ బాధ్యతల నుంచి తప్పించాలని కోరడంతో పార్టీ అధిష్టానం మాణికం ఠాగూర్‌ను కొత్త అధ్యక్షుడిగా నియమించింది. ప్రస్తుతం ఆయన విరుధునగర్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమిళనాడులో డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ వైదొలగిన నేపథ్యంలో మాణికం ఠాగూర్ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన ఆయన జాతీయ స్థాయిలోనూ పలు రకాల బాధ్యతలను నిర్వర్తించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయనను టీఎన్‌సీసీ నూతన అధ్యక్షుడిగా నియమించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది.

### విద్యార్థి దశ నుంచే రాజకీయాలు

1975 జూన్ 1న శివగంగైలో జన్మించిన మాణికం ఠాగోర్, బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి బీఏ-ఎల్‌ఎల్బీ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్న ఆయన, 1994లో చీూఖ× జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. తర్వాత 1996లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1997లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా, 1999లో జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎదిగారు. 2003 నుంచి 2005 వరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన, 2006లో కేంద్ర ఎన్నికల అథారిటీ ఛైర్మన్‌గా, 2008లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎన్నికల కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2009లో తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. పార్లమెంట్ పలు స్థాయి సంఘాల్లో సభ్యుడిగా ఉన్నారు. 2013 నుంచి 2016 వరకు పార్టీ తరపున పలు రాష్ట్రాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2017 నుంచి దాదాపు మూడేళ్ల పాటు ఏఐసీసీ కార్యదర్శి హోదాలో కర్ణాటక కాంగ్రెస్ ఇంచార్జిగా వ్యవహరించారు. 2019లో రెండోసారి ఎంపీగా గెలిచారు. 2020 నుంచి దాదాపు మూడేళ్ల పాటు తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## 'ప్రభుత్వ లాంఛనాలతో భాగ్యరాజ్ అంత్యక్రియలు'.. సీఎం విజయ్ ఆదేశాలు



న్యూఢిల్లీ,: ప్రముఖ దర్శకుడు, నటుడు భాగ్యరాజ్ అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని సీఎం విజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భారతీయ సినిమాకు భాగ్యరాజ్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒక సంతాప సందేశాన్ని విడుదల చేశారు. భాగ్యరాజ్ మరణం తమిళ చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర సాంస్కృతిక రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. దర్శకుడిగా, నటుడిగా, కథా రచయితగా సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ కనబరిచిన అరుదైన ప్రతిభాశాలి భాగ్యరాజ్ అని కొనియాడారు. భాగ్యరాజ్ తన విలక్షణమైన కథన శైలి, సహజమైన హాస్యం, గ్రామీణ నేపథ్యాలను వాస్తవికంగా చూపిన విధానంతో తమిళ సినిమాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఆయన సినిమాలు కేవలం వినోదాన్ని పంచడమే కాకుండా, మానవ విలువలు, సామాజిక అంశాలను ప్రతిబింబించాయని సీఎం విజయ్ వివరించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద సహాయకుడిగా సినీ జీవితాన్ని ప్రారంభించిన భాగ్యరాజ్, 1979లో 'సువారిల్లత చిత్రంగళ్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తర్వాత ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి, తమిళ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. భాగ్యరాజ్ మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

## కారులో మహిళను పొడిచిన యువకుడు.. నాటు బాంబు పేలి అదే కారులో సజీవ దహనం



న్యూఢిల్లీ,: కర్ణాటకలో దారుణ ఘటన జరిగింది. కారులో ఒక మహిళను కత్తితో పొడిచిన ఒక యువకుడు.. అనంతరం అదే కారులో నాటు బాంబు పేలి సజీవదహనమయ్యాడు. బాధిత యువతి, కారు డ్రైవర్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో శనివారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేంద్ర (30) అనే వ్యక్తి బెంగళూరులో శనివారం ఒక కారు బుక్ చేసుకున్నాడు. అనంతరం తన సన్నిహితురాలైన రమ్యా ఉల్లాస్ (23)ను కారులో ఎక్కించుకున్నాడు. రమ్య స్వస్థలం ఉత్తర కర్ణాటక జిల్లా. ఆమె బెంగళూరులోని సంజయ్ గాంధీ ఆస్పత్రిలో టెక్నీషియన్‌గా పని చేస్తోంది. నాగేంద్ర, రమ్య ఉల్లాస్ కలిసి కారులో అంకోలా వెళ్తున్నారు. కారు వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరి మధ్యా కొంత దూరం వెళ్లిన తర్వాత వాగ్వాదం చోటు చేసుకుంది. ఇది ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో తుమకూరు జిల్లా సమీపంలోకి చేరుకోగానే రమ్యపై నాగేంద్ర కత్తితో దాడి చేశాడు. ఇదే సమయంలో ఒక నాటు బాంబుతో కూడా దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో రమ్య.. వెంటనే డ్రైవర్ ప్రవీణ్‌కు విషయం చెప్పి, అప్రమత్తం చేసింది. అతడు తనపై దాడి చేశాడని, నాగేంద్ర వద్ద బాంబు కూడా ఉందని చెప్పింది. అప్పుడే ఆమె కారులోంచి బయటకు కూడా దూకేసింది. డ్రైవర్ కూడా వెంటనే కారును ఆపి పక్కకు దిగిపోయాడు. వెంటనే నాగేంద్ర కార్ డోర్ లాక్ చేసుకున్నాడు. ఆ తర్వాత అతడు తీసుకొచ్చిన నాటు బాంబు ప్రమాదవశాత్తు పేలిందో లేక అతడే పేల్చుకున్నాడో ఇంకా తెలియదు కానీ.. ఆ బాంబు పేలి మంటలు చెలరేగాయి. కారుకు మంటలు అంటుకున్నాయి. నాగేంద్ర అందులోనే సజీవ దహనమయ్యాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. నాగేంద్ర మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారు పేలిన ఘటనలో డ్రైవర్ ప్రవీణ్‌కు కూడా గాయాలయ్యాయి. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించిన అధికారులు చికిత్స అందిస్తున్నారు. కత్తిపోటు గాయాలైన రమ్యను కూడా తుమకూరు జిల్లా ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. తుమకూరు జిల్లా ఎస్పీ కూడా ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలతోపాటు నాటు బాంబు ఎలా వచ్చింది అనే దానిపై విచారణ జరుపుతామన్నారు.

## ' ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్ష సాధింపు'



హైదరాబాద్: తనకున్న భద్రతను తొలగించడంపై మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్‌నేత నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగానే తన భద్రతను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసే తన భద్రతను తొలగించాయని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఎండగడుతున్నందుకే తనకు భద్రతను తొలగించారన్నారు. మావోయిస్టు, నక్సల్స్, ప్రభావితా ప్రాంతాల్లో పనిచేసినందుకు తనకు హోం శాఖ భద్రతను ఇచ్చిందని, రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి ఏం చేశాడని స్పెషల్ భద్రతను ఇచ్చారని ప్రశ్నించారు. తన భద్రతను తొలగించడంపై డీజీపీకి లేఖ రాశానన్నారు. తనకు ఎలాంటి హానీ జరిగినా సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత వహించాలన్నారు. భద్రతను తొలగించినంత మాత్రానా ప్రజా సమస్యలపై, కాంగ్రెస్, బీజేపీ దోపిడీలు పై ప్రశ్నించను అనుకోవడం వారి మూర్ఖత్వమని హెచ్చరించారు. .

# పాస్‌పోర్టూ పనికిరాదా?



ప్రపంచంలో ఏ దేశం పాస్‌పోర్టు శక్తిమంతమైందో లెక్కేసిచెప్పే హెన్లే పాస్‌పోర్టు ఇండెక్స్ (హెచ్‌పీఐ)... మన పాస్‌పోర్టు 75వ స్థానంలో ఉందంటూ ఈ ఏడాది మొదట్లో నిర్ధారించింది. 'హమ్మయ్య... నిరుటితో పోలిస్తే పదిమెట్లు పైకొచ్చాం' అని మన పౌరులు గర్వపడి ఆర్నెల్లు కాకుండానే దానికేమీ పెద్దగా విలువలేదనీ, భారత పౌరసత్వానికి అదేమీ రుజువు కాబోదనీ మన విదేశాంగ శాఖ తేల్చిచెప్పి, ఆ సంతోషంపై నీళ్లు చల్లింది. 'ఇది ఇప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు... గత పుష్కరకాలంలోని నిర్ణయం కానేకాదు. 1967 నాటి పాస్‌పోర్టు చట్టమే ఆ మాట చెప్పిం'దని సెలవిస్తోంది. గత కాలపు నిర్ణయం అయినంత మాత్రాన ఏదైనా శిరోధార్యమవుతుందా... దాన్ని సమీక్షించటం, మార్చటం అసాధ్యమా అన్న ప్రశ్నలు సహజంగానే అందరిలో తలెత్తుతున్నాయి. ఈమధ్యకాలంలో ఎన్నికల సంఘం (ఈసీ) ధర్మమా అని పౌరసత్వంపై ప్రజానీకంలో ఆందోళన బయల్దేరింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట బిహార్‌లో మొదలై పలు రాష్ట్రాల్లో సాగిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కావలసినంత కలవరపాటును సృష్టించింది. ఇంకా సృష్టిస్తోంది. పౌరులమని నిరూపించుకునే పత్రాలు సమర్పిస్తేనే ఓటు ఉంటుందనటంవల్ల పలు రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో పౌరులు ఓటుహక్కు కోల్పోయారు. యూపీలో అలాంటివారు రెండు కోట్ల పైమాటే. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోవటం తక్షణ ప్రమాదమైతే... దేశంలో నివసించటం అసాధ్యమయ్యే స్థితి ఏర్పడటం ముమ్ముందు ఎదురయ్యే ముప్పు. ఈ దేశ పౌరులని ఈసీ నమ్మితేనే ఎవరికైనా ఓటుహక్కు లభిస్తుంది. అలాగని ఓటర్ గుర్తింపు కార్డు పౌరసత్వానికి రుజువు కాబోదని ప్రభుత్వమే చెబుతోంది. ఇప్పుడు పాస్‌పోర్టు సైతం ఆ ఖాతాలో చేరింది. పదిహేనేళ్ల క్రితం మహారాష్ట్రలోని తెంభ్లీలో ఆధార్‌ను లాంఛనంగా ప్రారంభించి నప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమనీ, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినా వుంటుందనీ అన్నారు. నిరుపేదలకు ఏ గుర్తింపు కార్డూ లేకపోవటాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రాజెక్టు ప్రారంభించామని కూడా చెప్పారు. తీరా సర్ ప్రక్రియ సమయంలో అది చెల్లుబాటు కాబోదని ఈసీ తేల్చి చెప్పింది. అటుపై సుప్రీంకోర్టు అనుమతించిన 12 పత్రాల్లో పాస్‌పోర్టు కూడా ఉండటం చాలామందికి ఊరటనిచ్చింది. ఇప్పుడు పాస్‌పోర్టు కూడా పౌరసత్వాన్ని నిర్ధారించటానికి పనికిరాదనటం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. అవధానాల్లో ఆశువుగా పద్యం చెప్పే అవధానికి 'నిషిద్ధాక్షరి' మాటున పృచ్ఛకుడు అడుగడుగునా అడ్డుతగులుతూ, ప్రతి పదంలోనూ అక్షరాలను నిషేధిస్తూ ముప్పు తిప్పలు పెడతాడు. వీటన్నిటినీ అధిగమించి ఛందోబద్ధంగా అందమైన పద్యాన్ని అల్లటం అవధాని పద సంపదకు పరీక్ష. పౌరసత్వం విషయంలో దేశ పౌరులకు ఇలాంటి పరీక్షే ఎదురవుతోంది. ఏ పత్రం దాఖలు చేద్దామనుకున్నా అది పనికిరాదని చెప్పటం తప్ప, పనికొచ్చేదేమిటో పాలకులు నిర్ధారణగా చెప్పరు. ఇందువల్ల సామాన్యుల్లో అభద్రతా భావన ఏర్పడటం తప్ప సాధిస్తున్నదేమిటి? పాస్‌పోర్టు చట్టం సెక్షన్ 6(2)(ఏ) ఈ దేశ పౌరుడుకాని వ్యక్తికి పాస్‌పోర్టు నిరాకరించాలని స్పష్టంగా చెబుతోంది. ప్రభుత్వం జారీ చేసే పాస్‌పోర్టే వేరే దేశాలకు ప్రమాణం. దాన్నిబట్టే వీసాలు జారీ అవుతాయి. అది పనికిరాదంటే ఆ దేశాలు అడుగుపెట్టనిస్తాయా? హెచ్‌పీఐ ర్యాంకులు సాధారణమైనవేం కాదు. ప్రపంచంలో సింగపూర్ పాస్‌పోర్టును మొత్తం 192 దేశాలు గుర్తించి, వీసా అవసరం లేకుండానే తమ భూభాగాల్లో అడుగు పెట్టేందుకు అనుమతిస్తున్నాయి. అందువల్లే అది ప్రథమ స్థానంలో ఉంది. 187 దేశాల గుర్తింపుతో జపాన్, దక్షిణ కొరియాలు... 186 దేశాల గుర్తింపుతో స్వీడన్, యూఏఈలు 2, 3 స్థానాల్లో ఉన్నాయి. అలా చూస్తే మన పాస్‌పోర్టుకు 56 దేశాల గుర్తింపు మాత్రమే ఉంది. ఇతరచోట్లకు వెళ్లాలంటే వీసా కావాలి. వారు సైతం పాస్‌పోర్టు ఆధారంగానే వీసా జారీచేస్తారు. ఇప్పుడు విదేశాంగశాఖ తకరారుతో అంతర్జాతీయంగా ఎవరైనా తలుపులు మూస్తే మన పౌరుల గతేమిటి? ఎన్నో దేశాల్లో అన్నిటికీ చెల్లుబాటయ్యే కార్డు జారీ విధానం దశాబ్దాల క్రితమే అమల్లోకొచ్చింది. మనం మాత్రం అభద్రతాభావంతో పౌరులకు అడుగడుగునా సమస్యలు సృష్టిస్తున్నాం. ఇది సబబేనా?

# వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

### భారత్, అమెరికా బంధంలో నూతన అధ్యాయం
### ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య సాన్నిహిత్యం అద్భుతం
### యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో



వాషింగ్టన్: భారత్, అమెరికా బంధంలో మరో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. వచ్చే ఏడాది (2027) ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంలో పర్యటించనున్నట్లు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రెసిడెంట్ ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం అత్యంత అద్భుతమైనదని కొనియాడిన రూబియో.. ఇరు దేశాల దౌత్య సంబంధాలు 'ఫెంటాస్టిక్' అంటూ అభివర్ణించారు. వాషింగ్టన్ డీసీలో ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన, ఈ మెగా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు తాను ఈ ఏడాది చివరికల్లా భారత్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు.

### ఫైనల్ స్టేజ్‌లో ట్రేడ్ డీల్

ట్రంప్ పర్యటన కేవలం ఒక విజిట్ మాత్రమే కాదు, దీని వెనుక భారీ వాణిజ్య వ్యూహం దాగి ఉంది. గత 16 నెలల్లో మొదటిసారిగా ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరిగిన జీ7 సమ్మిట్ వేదికగా మోదీ, ట్రంప్ ఇరుపక్షాల మధ్య చర్చలు జరిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చివరి దశకు చేరుకుందని రూబియో పేర్కొన్నారు. 'మేం ట్రేడ్ డీల్‌ను పూర్తి చేసేందుకు కేవలం అంగుళాల దూరంలో ఉన్నాం, ఇది చాలా సానుకూల పరిణామం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం పూర్తయితే రెండు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో పెను మార్పులు రానున్నాయి.

### మోదీపై రూబియో ప్రశంసలు

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మార్కో రూబియో ఆకాశానికెత్తారు. తాను మోదీకి పెద్ద 'ఫ్యాన్' అని చెబుతూ, అంతర్జాతీయ వేదికపై భారతదేశ ప్రతిష్టను మోదీ సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లారని కొనియాడారు. 'మోదీ భారతదేశాన్ని ఒక గ్లోబల్ పవర్‌గా (ప్రపంచ శక్తిగా) మార్చారు' అని రూబియో వ్యాఖ్యానించారు. అలాగే, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత కీలకమైన 'క్వాడ్' (ఖబఖుు) కూటమి తదుపరి సమావేశం కోసం ఇరు దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఎనర్జీ సెక్టార్‌లో మెగా పార్ట్‌నర్‌షిప్

ఇక ఇంధన రంగం పరంగా భారత్ ప్రాధాన్యతను అమెరికా ప్రత్యేకంగా గుర్తించింది. ఇంధన సరఫరాను మరింత పెంచేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని రూబియో తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత భారీ క్రూడ్ ఆయిల్ ను శుద్ధి చేసే అరుదైన సాంకేతిక సామర్థ్యం కలిగిన కొన్ని దేశాల్లో భారతదేశం ఒకటని ఆయన ప్రశంసించారు. ఒకవేళ వచ్చే ఏడాది ట్రంప్ భారత్‌కు వస్తే, 2020 ఫిబ్రవరి తర్వాత ఆయనకు ఇదే మొదటి భారత పర్యటన అవుతుంది. అలాగే రెండోసారి వైట్ హౌస్ బాధ్యతలు చేపట్టాక ఇదే తొలి విజిట్ కానుంది.

# 'ట్రంప్ కన్నా పుతిన్ బెటర్'.. తేల్చేసిన భారతీయులు

### ప్రపంచ వ్యవహారాల్లో పుతిన్‌పైనే భారత్‌కు నమ్మకం
### పడిపోయిన అమెరికా క్రేజ్
### ప్యూ రీసెర్చ్ సర్వేలో సంచలన నిజాలు



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యవహారాలను చక్కదిద్దడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పైనే భారతీయులు ఎక్కువ నమ్మకం ఉంచారని ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన తాజా గ్లోబల్ సర్వేలో వెల్లడయ్యింది. ఫిబ్రవరి 8 నుండి మే 13, 2026 మధ్య కాలంలో 36 దేశాల్లోని 42,151 మందిపై నిర్వహించిన ఈ అంతర్జాతీయ పోల్‌లో, ట్రంప్ నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ముఖ్యంగా అంతకుముందుతో పోలిస్తే భారతదేశంలో ట్రంప్ పట్ల నమ్మకం గణనీయంగా తగ్గడం గమనార్హం.

### రష్యా వైపే భారత్ మొగ్గు.. పుతిన్‌కు జై

ఈ సర్వే నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించగలరని 51 శాతం మంది భారతీయులు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై పూర్తి నమ్మకం వ్యక్తం చేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సరైన నిర్ణయాలు తీసుకోగలరని కేవలం 39 శాతం మంది భారతీయులు మాత్రమే నమ్మారు. గత ఏడాది సర్వేలో ట్రంప్‌కు భారతదేశంలో 51 శాతం మద్దతు ఉండగా, ఈసారి అది భారీగా పడిపోవడం అమెరికా విదేశాంగ విధానాలకు గట్టి ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

### ట్రంప్ విధానాలపై భారతీయుల తీవ్ర అసంతృప్తి

భారతదేశంలో ట్రంప్ గ్రాఫ్ పడిపోవడానికి ఆయన తీసుకున్న పలు వివాదాస్పద నిర్ణయాలే కారణమని సర్వే స్పష్టం చేసింది. అంతర్జాతీయ సుంకాలు, వెనిజువెలా, ఇరాన్ సంక్షోభాల విషయంలో ట్రంప్ తీరును మెజారిటీ భారతీయులు తప్పుపట్టారు. అలాగే అమెరికా అమలు చేస్తున్న కఠినమైన వలస విధానాలను కేవలం 32 శాతం మందే సమర్థించారు. అంతర్జాతీయ సహాయక సంస్థ అయిన 'యూఎస్ఏఐడి'ని మూసివేయడం, గాజా స్ట్రిప్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను డొనాల్డ్ ట్రంప్ డీల్ చేసిన విధానంపై కూడా భారతీయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

### ప్రపంచవ్యాప్తంగా ట్రంప్‌కు నిరాశే..

భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోని 16 దేశాల్లో ట్రంప్ రేటింగ్స్ దారుణంగా పడిపోయాయి. సర్వేలో పాల్గొన్న మొత్తం దేశాల్లో 76 శాతం మంది ట్రంప్ నాయకత్వంపై తమకు ఏమాత్రం నమ్మకం లేదని తేల్చి చెప్పారు. కేవలం 23 శాతం మంది మాత్రమే ఆయనను సమర్థించారు. జర్మనీ, ఫ్రాన్స్ వంటి ఐరోపా దేశాలతో పాటు ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లోనూ ట్రంప్‌కు అతి తక్కువ రేటింగ్స్ వచ్చాయి. అయితే, ఇజ్రాయెల్‌లో మాత్రం అత్యధికంగా 66 శాతం మంది ట్రంప్ నిర్ణయాలను సమర్థించడం విశేషం.

## స్టాలిన్‌కు మరో షాక్.. డీఎంకే కూటమి నుంచి వైదొలిగిన ఎండీఎంకే



చెన్నై: తమిళనాడు మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌కు మరో షాక్ ఎదురైంది. ఆయన నేతృత్వంలోని డీఎంకేతో 9 ఏళ్లుగా కలిసి ఉన్న ఎండీఎంకే ఆ కూటమి నుంచి వైదొలగింది. పార్టీ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రభుత్వాన్ని స్వాగతించడంతో పాటు ఎన్నికల హామీల విషయంలో రాజీపడకుండా వ్యవహరించాలని ఒక తీర్మానంలో కోరింది. అవినీతి రహిత పాలన అందించాలని, మెకెదాటు డ్యామ్ ప్రాజెక్ట్ వంటి అంశాలపై తమిళనాడు హక్కులను పరిరక్షించడం వంటి వాటిపై ప్రభుత్వం దృఢంగా ఉండాలని సూచించింది. అయితే అధికార టీవీకే కూటమి వైపు ఎండీఎంకే మొగ్గుచూపుతున్నప్పటికీ అందులో చేరడం గురించి ఆమోదించిన తీర్మానాల్లో స్పష్టంగా ప్రస్తావించలేదు. కాగా, డీఎంకే కూటమి నుంచి వైదొలగడాన్ని ఎండీఎంకే సమర్థించుకున్నది. తమ పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయని విమర్శించింది. అలాగే తమిళనాడులో అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి డీఎంకే వద్ద ఒక రహస్య ప్రణాళిక ఉన్నట్లు ఆరోపించింది. ఈ పరిస్థితుల వల్ల డీఎంకే కూటమిలో కొనసాగడం అసాధ్యమని పేర్కొంది. అయితే ఎండీఎంకే ఆరోపణలను డీఎంకే ఖండించింది. అసెంబ్లీ, పార్లమెంటులో ఎండీఎంకే ప్రాతినిధ్యం పొందేలా చేసింది డీఎంకేనే అని ఆ పార్టీ నేత సయ్యద్ హఫీజుల్లా తెలిపారు. 'వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా వైకో సాగించిన పోరాటానికి ఇది పూర్తిగా విరుద్ధం. ఎండీఎంకేలో ఆయన కుమారుడు దురై వైకోకు ఉన్నత స్థానం కల్పించడమే ఆ పార్టీ బలహీనపడటానికి కారణం' అని ఆయన అన్నారు. మరోవైపు డీఎంకే కూటమి నుంచి ఎండీఎంకే వైదొలగడంపై ఆ పార్టీలో అసమ్మతి రాజుకున్నది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గుర్తుపై గెలిచిన ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తాము డీఎంకేతోనే కొనసాగుతామని సంకేతాలు ఇచ్చారు. సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని వారు బహిష్కరించారు. దీంతో ఎండీఎంకే అధికారికంగా టీవీకేతో జతకట్టినప్పటికీ, అధికార పార్టీ శాసనసభ బలం పెరుగదు. అలాగే ఉప ఎన్నికలకు దారితీసే పరిస్థితి కూడా ప్రస్తుతం లేనట్లు తెలుస్తున్నది.

## ఆపరేషన్ టైగర్ 3.0.. షిండేవైపు 14 మంది ఎమ్మెల్యేలు.. ఉద్ధవ్ వర్గానికి మరో ఎదురుదెబ్బ తప్పదా..?




**న్యూఢిల్లీ,:** మహారాష్ట్ర రాజకీయాల్లో మరో భారీ కుదుపురాబోతున్నట్లు తెలుస్తోంది. ఉద్ధవ్ వర్గానికి చెందిన కొందరు శివసేన ఎమ్మెల్యేలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీన్ని ఆపరేషన్ టైగర్ 3.0గా అభివర్ణిస్తున్నారు షిండే వర్గపు నేతలు. తాజాగా షిండే వర్గంలోని శివసేనకు చెందిన మంత్రి గులాబ్‌రావ్ పాటిల్ దీనిపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఆపరేషన్ టైగర్ 3.0 ప్రారంభమైందన్నారు. దీనిలో భాగంగా ఉద్ధవ్ వర్గానికి చెందిన 14 మంది ఎమ్మెల్యేలు త్వరలో డిప్యూటీ సీఎం షిండే వర్గంలో చేరుతారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉద్ధవ్ వర్గానికి చెందిన శివసేన పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల ఎమ్మెల్యేలు ఇతర పార్టీలో విలీనం కావొచ్చు. దీని ప్రకారం 20 మందిలో 14 మంది ఎమ్మెల్యేలు షిండే వర్గంలో చేరితే విలీనం పూర్తవుతుంది. వారికి ఫిరాయింపుల చట్టం వర్తించదు. ఇదే జరిగితే ఉద్ధవ్ శివసేనకు భారీ ఎదురుదెబ్బ తప్పదు. ప్రస్తుతం ఉద్ధవ్ శివసేన.. శరద్‌చంద్ర పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి మహా వికాస్ అఘాడి (ఎంవీయే) కూటమిగా ఉన్నాయి. ఈ కూటమికి 60 మంది ఎమ్మెల్యేలున్నారు. ఇటీవల ఎంవీయే సమావేశం జరిగింది. అయితే, సమావేశానికి 23 మంది ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. 37 మంది మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. దీంతో వీరంతా షిండే వర్గంలో చేరుతారనే ప్రచారం మొదలైంది. ఇటీవలే ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు షిండే వర్గంలో చేరారు. ఇటు ఎంపీలు, అటు ఎమ్మెల్యేలు వరుసగా పార్టీని వీడితే ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అయితే, తామంతా ఐక్యంగా ఉన్నామని, పార్టీలో, కూటమిలో ఎలాంటి విబేధాలు లేవని నేతలు అంటున్నారు.౹

## తెలంగాణకు రేవంత్ అన్యాయం: హరీష్‌రావు




హైదరాబాద్: కర్ణాటకలో జరిగిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సీక్రెట్ సమావేశమేంటో బయటపెట్టాలంటూ మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చారిత్రక ఒప్పందం అంటున్న రేవంత్.. ఆ ఒప్పందం ఏమిటో స్పష్టత ఇవ్వాలన్నారు. "కోల్డ్ స్టోరేజ్‌లోకి వెళ్లిన గుండ్రేవుల ప్రాజెక్ట్ నేడు తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రుల సమావేశంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, అధికారులను బయట కూర్చోబెట్టారు. నీటి వాటాల పంపకంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఇకపై ఊరుకునేదిలేదు ..కర్ణాటక ప్రతిపాదించిన నవేలితో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని గుండ్రేవుల ప్రాజెక్ట్ (20 టీఎంసీలు)ల వల్ల దిగువన ఉన్న తెలంగాణకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. రేవంత్‌రెడ్డి తన అవగాహన రాహిత్యంతో దీర్ఘకాలిక రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు" అంటూ హరీష్‌రావు మండిపడ్డారు.

## తెలంగాణ ప్రభుత్వానికి ట్రంప్ కృతజ్ఞతలు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఓ ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. యూఎస్ కాన్సులేట్ సమీపంలోని రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో స్పందించారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రహదారి నామఫలకాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అమెరికా రాయబారి సెర్జియో గోర్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సమక్షంలో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం తన 'ఎక్స్' వేదికగా స్పందించిన డొనాల్డ్ ట్రంప్..'హైదరాబాద్‌లో కొత్తగా 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' ఏర్పాటు చేశారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని నేనే. ధన్యవాదాలు!' అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నామకరణం ద్వారా భారత్--అమెరికా సంబంధాలు మరింత బలపడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. కార్యక్రమం అనంతరం అమెరికా ప్రతినిధులు కూడా ఈ నిర్ణయాన్ని సానుకూలంగా స్వాగతించినట్లు సమాచారం.

# బంగారంపై కొత్త రూల్స్..

### సౌదీకి వెళ్లే ముందు ఇది తెలుసుకోండి!

సౌదీ అరేబియా ప్రయాణికుల కోసం బంగారం డిక్లరేషన్ నిబంధనలు కఠినతరం

డిక్లరేషన్ పరిమితిని 60,000 రియాల నుంచి 40,000 రియాలకు తగ్గింపు

సుమారు రూ.10 లక్షల విలువైన బంగారం, ఆభరణాలు ఉంటే డిక్లరేషన్ తప్పనిసరి

నియమాలు ఉల్లంఘిస్తే వస్తువుల విలువలో 50శాతం వరకు జరిమానా

మనీ లాండరింగ్ నిరోధానికి దేశవ్యాప్తంగా సౌదీ ప్రభుత్వం చర్యలు



ఢిల్లీ: సౌదీ అరేబియా ప్రభుత్వం తమ దేశానికి వచ్చే, వెళ్లే ప్రయాణికుల కోసం బంగారం, విలువైన లోహాల డిక్లరేషన్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. మనీ లాండరింగ్ నిరోధక (ఏఎంఎల్) చట్టాల్లో భాగంగా ఈ మార్పులు చేసినట్లు వెల్లడించింది. తాజా నిబంధనల ప్రకారం ప్రయాణికులు తమ వద్ద ఉంచుకోగల బంగారం, ఆభరణాల డిక్లరేషన్ పరిమితిని 60,000 సౌదీ రియాల నుంచి 40,000 సౌదీ రియాలకు (సుమారు రూ.10.08 లక్షలు) తగ్గించింది. 'ఒకాజ్' అనే అరబిక్ దినపత్రిక కథనం ప్రకారం.. ఇకపై సౌదీ అరేబియాలోకి ప్రవేశించే లేదా దేశం విడిచి వెళ్లే ప్రయాణికులు తమ వద్ద 40,000 రియాలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన బంగారం కడ్డీలు, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలు ఉంటే, తప్పనిసరిగా కస్టమ్స్‌కు రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. అంతేగాక ఆ వస్తువుల విలువను నిర్ధారించేందుకు కొనుగోలు ఇన్‌వాయిస్‌ను కూడా చూపించాల్సి ఉంటుంది.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్త నిబంధనల ప్రకారం, ఎవరైనా తమ వద్ద ఉన్న బంగారం లేదా నగదు వివరాలను వెల్లడించడంలో విఫలమైతే, లేదా వారిపై మనీ లాండరింగ్ అనుమానాలు తలెత్తితే, ఆ వస్తువులను 72 గంటల వరకు స్వాధీనం చేసుకునే అధికారాన్ని జకాత్, పన్ను, కస్టమ్స్ అథారిటీ (జెడ్ఏటీసీఏ)కి కల్పించారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మనీ లాండరింగ్ అనుమానం లేనట్లయితే, స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. అదే తప్పు మళ్లీ చేస్తే, జరిమానా 50 శాతానికి పెరుగుతుంది. ఒకవేళ ఆర్థిక నేరాలకు సంబంధించిన అనుమానాలు ఉంటే, ఆ కేసులను పబ్లిక్ ప్రాసిక్యూషన్, ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్స్ విభాగానికి బదిలీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

మనీ లాండరింగ్‌పై ఉక్కుపాదం

ఈ నిబంధనల మార్పు, సౌదీ అరేబియా చేపట్టిన విస్తృత మనీ లాండరింగ్ నిరోధక చర్యలలో ఒక భాగం. ఇందులో భాగంగా ఆర్థిక సంస్థలు, ఇతర వ్యాపారాలు తమ కస్టమర్లు, ఉత్పత్తులు, లావాదేవీలకు సంబంధించిన మనీ లాండరింగ్ రిస్క్‌లను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. కస్టమర్ల గుర్తింపును ధ్రువీకరించడం, 25 శాతానికి పైగా వాటా ఉన్న కంపెనీల అసలు యజమానులను గుర్తించడం, నిధుల మూలాలను తెలుసుకోవడం తప్పనిసరి చేశారు. సరైన సమాచారం ఇవ్వని పక్షంలో లావాదేవీలను నిరాకరించే లేదా సంబంధాలను రద్దు చేసుకునే అధికారాన్ని సంస్థలకు ఇచ్చారు.

అలాగే, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు వంటి రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల విషయంలో మరింత కఠినమైన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలన్నింటిలోనూ డబ్బు పంపేవారి, స్వీకరించేవారి పూర్తి సమాచారం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద లావాదేవీలను ఏడు పనిదినాల వరకు నిలిపివేయడం, మనీ లాండరింగ్ కేసులతో సంబంధం ఉన్న ఆస్తులను స్తంభింపజేయడం వంటి అధికారాలను కూడా ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్స్ విభాగానికి కల్పించారు. ఈ చర్యల ద్వారా దేశంలో ఆర్థిక పారదర్శకతను పెంచి, అక్రమ రవాణా ప్రవాహాలను అరికట్టాలని సౌదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఈ ఏడు రోజులే అత్యంత బలమైన ముహూర్తాలు!

హిందూ సంప్రదాయంలో ఏ పని తలపెట్టిన శుభ ముహూర్తాలు చూసుకోవడం ఆనవాయితీ. కొత్త వస్తువులు, వాహనాలు కొనాలన్నా మంచి రోజులు ఉండాల్సిందే. అలాంటిది జీవితంలో అత్యంత ప్రధానమైన వివాహాలు, గృహప్రవేశాల విషయంలో నక్షత్ర, రాశి బలాలకు సరిపడా ముహూర్తాలపై ప్రజలకు అచంచల విశ్వాసం ఉంటుంది. అయితే గత మే 14న అధిక జ్యేష్ఠమాసం ప్రారంభం కావడంతో నెల రోజులుగా శుభకార్యాలకు బ్రేక్ పడింది.



### తాళికట్టు శుభవేళ..

ఈ నెల 15తో శూన్యమాసం ముగిసింది. 16 నుంచి నిజ జ్యేష్ఠమాసం ప్రారంభమైంది. జూన్ 27, 28, జూలై 1, 2, 3, 4, 5, 8, 9 తేదీలలో అత్యంత బలమైన ముహూర్తాలు ఉన్నాయని జ్యోతిష పండితులు చెబుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్ మాసాల్లోనూ మంచి ముహూర్తాలు ఉన్నాయని అంటున్నారు.

### వ్యాపారాలు కళకళ..

నెలరోజులుగా ముహూర్తాలు లేకపోవడంతో కల్యాణ మండపాలు, కేటరింగ్, టెంట్ హౌస్‌లు, డెకరేషన్, పూల వ్యాపారులు, పురోహితులు, బంగారం షాపులు, వస్త్రవ్యాపారులు, ఫొటోగ్రాఫర్ల వ్యాపారాలు మందగించాయి. చాలా మంది కారి?మకులకు ఉపాధి కరువైంది. జూన్ 19 నుంచి మళ్లీ సీజన్ ప్రారంభం కానుండటంతో ఈ అనుబంధ వ్యాపారాలన్నీ ఊపందుకుంటాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



### రెండు వేల వరకు వివాహాలు

నెల రోజుల తర్వాత ముహూర్తాలు మొదలవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో వధూవరులకు కావలసిన వస్త్రాలు, పట్టుచీరలు కొనేందుకు తల్లిదండ్రులు, బంధువులు షాపులకు క్యూ కడుతున్నారు. కిరాణా దుకాణాలలో కూడా వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

### 'బంగారం' లాంటి చాన్స్

పెళ్లికి ముఖ్యమైనది బంగారం. దాని ఖరీదు పెరుగుతున్నా తప్పని సరిగా బంగారం పెట్టాల్సిందే. స్వర్ణాభరణాల ధరలు పెరుతున్నా పెళ్లికి అతిముఖ్యంగా కావలసిన తాళిబొట్టు, మట్టెలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో కొందరు బంగారం షాపుల వద్ద చేరి వీటిని ముందుగా ఆర్డర్ ఇచ్చి చేయించుకుంటున్నారు. మరికొందరు బంగారం ముక్క కొనుగోలు చేసి తమకు తెలిసిన తయారీదారుని వద్ద వెళ్లి ఆర్డర్ ఇస్తున్నారు.

# 'ఆపరేషన్ సిందూర్' అమరుల్లో మన అగ్నివీర్

### కేంద్రం విడుదల చేసిన జాబితాలో మురళీనాయక్ పేరు

### మనసారా జోహార్లర్పిస్తున్న రాష్ట్ర ప్రజలు

### 2022లో ఆర్మీలో చేరిన వీర జవాన్

### బాల్యం నుంచి చదువు, క్రీడల్లో రాణింపు






పుట్టపర్తి: ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన ఆంధ్ర అగ్నివీర్ మురళీనాయక్ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. కేంద్రం తాజాగా ప్రకటించిన అమరుల జాబితాలో ఆయన పేరు ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆయన ప్రాణత్యాగానికి మనసారా జోహార్లు అర్పిస్తున్నారు. దేశానికి మురుళీ నాయక్ చేసిన సేవలను, ఆయన వీరత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు. మురళీ నాయక్ ఆగస్టు 10, 2002న జన్మించారు. పదో తరగతి వరకు శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లిలోని విజ్ఞాన్ పాఠశాలలో చదువుకున్నారు. మురళీనాయక్ 2016--17 విద్యా ుసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశారు. బాల్యం నుంచి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేవారు. ఆయుున తల్లి స్వగ్రామం నాగినాయని చెరువు తండా కావడంతో సోమందేపల్లిులోని అమ్మమ్మ వాళ్ల ఇంట్లో ఉంటూ విద్యాభ్యాసం పూర్తి చేశారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత అనంతపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివారు. ఆ తర్వాత ఆర్మీ కోచింగ్ స్కూల్‌లో చేరి ఉద్యోగం సంపాదించారు. 2022లో మురళీనాయక్ ఆర్మీలో చేరారు. అప్పటి నుంచి తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామనాయక్ దంపతులు గోరంట్ల మండలం కల్లితండాలో స్థిరపడ్డారు. తొలుత మురళీ నాయక్ అసోంలో పని చేశారు. ఆ తర్వాత కశ్మీర్‌కు బదిలీ అయ్యాుురు. పహల్గాంలో పాక్ ఉగ్రవాదుల దుశ్చర్య నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్'లో 2025 మే 8న మురళీ నాయక్ వీరమరణం పొందారు. కాల్పుల్లో చనిపోయే నాటికి మురళీ నాయక్ వయసు 22 ఏళ్లే. మురళీ వీరమరణం పొందిన మరుసటి రోజే గోరంట్ల మండలం కల్లి తండాకు భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. అదేనెల 11న సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. 2025 మే 13న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మురళీ నాుయుక్ కుుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రూ.25 లక్షలు సాయం ప్రకటించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .